## విలేకరులు కావలెను
పెన్ సత్తా తెలుగు దినపత్రిక
ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.
ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily



సంపుటి : 3 | సంచిక : 283 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | గురువారం 5 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool

## పీపీపీ విధానంపై జగన్ అసత్య ప్రచారం

### మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపాటు



వైకాపా హయాంలో 17 వైద్య కళాశాలల నిర్మాణం కోసం రూ.8,480 కోట్లు మంజూరు చేస్తే ఖర్చు చేసింది రూ.1,550 కోట్లు మాత్రమేనని.. ఇందులోనూ పులివెందుల కళాశాలకే రూ.400 కోట్లు వెచ్చించారని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రూపాయిలో 18 పైసలు మాత్రమే ఖర్చు పెట్టి 17 కళాశాలల్ని నిర్మించినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వైకాపా నేతలు గుండెలు తీసిన బంట్లు అనే దానికి ఇదే నిదర్శనమని ధ్వజమెత్తారు. పీపీపీ విధానంలో 10 కళాశాలల్లో అదనంగా 610 ఎంబీబీఎస్ సీట్లు, అనుబంధ ఆసుపత్రుల్లో 1,050 అదనపు పడకలు అందుబాటులోకి వస్తాయన్నారు. బుధవారం శాసనసభలో వైద్యారోగ్యశాఖ బడ్జెట్ పద్దులపై చర్చ, ప్రశ్నోత్తరాల సందర్భంగా మంత్రి మాట్లాడారు. 'వైకాపా ప్రభుత్వ నిర్వాకం కారణంగా

- మిగతా 2లో

## ఇవి అడ్రస్ లేని కంపెనీలా?

- రాబోయే ఐదేళ్లలో కేవలం ఐటీ రంగంలోనే 5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యమన్న లోకేశ్
- గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి సంస్థల ఏర్పాటుపై రాద్ధాంతం తగదని హితవు
- పెట్టుబడుల ఆకర్షణ కోసం గుజరాత్ తరహాలో రూపాయికే భూమి పాలసీ
- రూ.1.50 లక్షల కోట్ల విలువైన 52 ఒప్పందాలతో 2.3 లక్షల మందికి ఉపాధి అవకాశాలు



"గూగుల్, కాగ్నిజెంట్, టీసీఎస్, ఆసిప్ వంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు అడ్రస్ లేని కంపెనీలా? యువతకు ఉద్యోగాలు ఇచ్చే సంస్థలకు భూములిస్తే తప్పేంటి?" అని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యర్థి పక్షాన్ని సూటిగా ప్రశ్నించారు. అసెంబ్లీలో ఐటీ శాఖ పద్దులపై జరిగిన చర్చలో మంత్రి మాట్లాడుతూ.. 99 పైసలకే (రూపాయికి) భూమి కేటాయింపులపై

- మిగతా 2లో



## మోదీ ఇజ్రాయెల్ ను వీడిన 48 గంటల తర్వాత ఇరాన్‌పై దాడి...

### ఇజ్రాయెల్ రాయబారి ఏమన్నారంటే..?

- మోదీ ఇజ్రాయెల్ నుంచి వెళ్లిపోయాక దాడికి అవకాశం వచ్చిందన్న రాయబారి
- మోదీ పర్యటనలో దేశాభివృద్ధి గురించి మాత్రమే చర్చించినట్లు వెల్లడి
- యుద్ధం గురించి ఆయనతో చర్చించలేదని స్పష్టీకరణ

- మిగతా 2లో




## అమెరికాకు గట్టి ఎదురుదెబ్బ...

### కీలక రాడార్ స్టేషన్ ధ్వంసం చేసిన ఇరాన్!

- మధ్యప్రాచ్యంలో అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు
- కమ్యూనికేషన్, రాడార్ వ్యవస్థలే ప్రధాన లక్ష్యం
- ఏడు సైనిక స్థావరాల్లోని మౌలిక సదుపాయాలకు నష్టం
- అమెరికా-ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగానే ఈ దాడులు

- మిగతా 2లో

## అఫ్ఘాన్‌లో బగ్రామ్ వైమానిక స్థావరంపై పాక్ దాడి



అఫ్ఘానిస్థాన్‌లోని ప్రసిద్ధ బగ్రామ్ వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని పాకిస్థాన్ దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఓ ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్, రెండు గిడ్డంగులు ధ్వంసమయ్యాయని పాక్ అధికారిక మీడియాలో బుధవారం

- మిగతా 2లో



## బాణసంచా పేలుళ్ల ఘటనల్లో నిర్వాహకుల ఆస్తులు జప్తు చేస్తాం

**శాసనసభలో హోంమంత్రి వంగలపూడి అనిత**

బాణసంచా పేలుళ్ల ప్రమాదంలో నిర్వాహకుల ఆస్తులు జప్తు చేసి వాటిని బాధితులకు అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టంచేశారు. రాష్టంలో ఇటీవల

- మిగతా 2లో



### ఐపీఎల్‌లో సీఎస్‌కేకు విజిల్ వేస్తే

## ఎన్నికల్లో టీవీకే విజిల్‌కు ఓటేస్తారు

- తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు తనకు భావోద్వేగమన్న నటుడు విజయ్
- మిగతా పార్టీలకు సాధారణ ఎన్నిక అని వ్యాఖ్య
- ఢిల్లీ బీజేపీతో పాటు అన్ని జట్లను టీవీకే ఓడిస్తుందన్న విజయ్

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు తనకు, తనను ప్రేమించే వారికి భావోద్వేగమని ప్రముఖ సినీ నటుడు, టీవీకే పార్టీ


- మిగతా 2లో

## 26 రకాల వివరాలతో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు

- అసెంబ్లీ చాంబర్‌లో ఎఫ్‌బీఎంఎస్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష
- వివిధ శాఖల నుంచి సమాచారాన్ని సమీకృతం చేయాలని సూచన
- ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటాబేస్ సిద్ధం చేయనున్న అధికారులు
- 26 రకాల అంశాలతో పకడ్బందీగా డేటాబేస్ రూపొందించాలన్న సీఎం

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఒకే గొడుగు కిందకు తెచ్చేలా రూపొందిస్తున్న 'ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (ఎఫ్ బీఎంఎస్)పై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా అసెంబ్లీలోని తన చాంబర్‌లో అధికారులతో ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఫ్యామిలీ ఐడీ,

- మిగతా 2లో



# 20 నెలల్లో 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించాం

- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ప్రసంగం
- గత పాలనలో పారిశ్రామిక విధ్వంసం.. ఇప్పుడు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అని వివరణ
- పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణం
- ఏపీకి క్యూ కడుతున్న ప్రపంచ స్థాయి సంస్థలు
- గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖలో భారీ కుంభకోణం
- పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పిస్తూ నిర్ణయం



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 20 నెలల కాలంలో సాధించిన ప్రగతిని, భవిష్యత్ కార్యాచరణను ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభ వేదికగా వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఐటీ, ఉద్యోగ కల్పన, వైద్య, విద్య తదితర కీలక రంగాలపై ఆయన సుదీర్ఘంగా ప్రసంగించారు. కేవలం 20 నెలల్లోనే రాష్ట్రంలో 6.28 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని సీఎం అధికారికంగా ప్రకటించారు.

**ఉద్యోగాల కల్పనలో దూకుడు**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని చంద్రబాబు తెలిపారు. ఎంఎస్‌ఎంఈ రంగంలో 2.48 లక్షలు, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 1.46 లక్షలు, వివిధ పరిశ్రమల్లో 95 వేలు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో 64 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని గణాంకాలతో సహా వివరించారు. అలాగే మెగా డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్, ఇతర ప్రభుత్వ విభాగాల్లో కలిపి 30,500 ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. ఎన్నికల ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చామని, అంతకంటే ఎక్కువ ఉద్యోగాలను కల్పించి మాట నిలబెట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీని కూడా నియమించినట్లు వెల్లడించారు.

**మళ్లీ వెలుగులోకి ఏపీ బ్రాండ్**

గత ప్రభుత్వ పాలనపై విరుచుకుపడ్డ సీఎం, 2019-24 మధ్య కాలంలో ఏపీ బ్రాండ్ ఇమేజ్ పూర్తిగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో జాకీ, అమర్ రాజా, లులూ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు రాష్ట్రాన్ని వదిలి వెళ్లిపోయాయని గుర్తు చేశారు. ఆ సమయంలో ఏర్పడిన ప్రతికూల పరిస్థితుల వల్ల 913 కంపెనీలు మూతపడ్డాయని ఆర్బీఐ నివేదికే స్వయంగా వెల్లడించిందని సభ దృష్టికి తెచ్చారు. గతంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు చిరునామాగా ఉన్న ఏపీని, ఇప్పుడు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దిశగా మారుస్తున్నామని చెప్పారు. కేవలం 26 కొత్త పాలసీలతో వేగంగా అనుమతులు ఇస్తూ పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని తెలిపారు. ఇటీవల విశాఖలో జరిగిన సదస్సులో ఏకంగా రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని,

- మిగతా 2లో

### ఇరాన్ సుప్రీం లీడర్? ఎవరైనా చావే గతి..

## ఇజ్రాయెల్ డెడ్లీ వార్నింగ్



ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరిని ఎన్నుకున్నా అంతమొందిస్తామని ఇజ్రాయెల్-అమెరికా స్పష్టం చేశాయి. ఇరాన్‌కు ఇజ్రాయెల్ డెడ్లీ వార్నింగ్ ఇచ్చింది. ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి ఇజ్రాయెల్

- మిగతా 2లో



# యుద్ధ విధ్వంసం

- ఇరాన్ నాయకత్వం, భద్రతా బలగాలే లక్ష్యంగా అమెరికా-ఇజ్రాయెల్ దాడులు
- ఆ దేశ సైనిక ప్రధాన కేంద్రంపై 250 బాంబులు
- ఇజ్రాయెల్, అమెరికా స్థావరాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులు
- చమురు శుద్ధి కేంద్రంపై మళ్లీ దాడి
- ఇరాన్ సుప్రీం నేతగా మొజ్తాబా?
- ఆయననూ చంపేస్తామన్న ఇజ్రాయెల్
- ఇరాన్‌లో 1,045కు చేరిన మృతులు

- మిగతా 2లో

దుబాయ్: అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్‌ల యుద్ధం విధ్వంసం సృష్టిస్తోంది. ఇరాన్‌లోని నాయకత్వం, సైనిక బలగాలే లక్ష్యంగా సంయుక్త దళాలు దాడులు చేస్తున్నాయి. ఐదో రోజైన బుధవారం రాజధాని టెహ్రాన్‌తోపాటు పలు నగరాలపై బాంబుల వర్షం కురిసింది. సైనిక ప్రధాన కేంద్రంపై 100 ఫైటర్ జెట్లతో 250 బాంబులను ఇజ్రాయెల్ వేసింది.

# 20 నెలల్లో 6.28 లక్షల ఉద్యోగాలు కల్పించాం

-మొదటిపేజీ తరువాయి
వీటి ద్వారా భవిష్యత్తులో 16 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు.

**రాష్ట్రానికి అంతర్జాతీయ సంస్థలు**

ఎన్డీఏ కూటమి పాలనపై నమ్మకంతో ప్రపంచ ప్రఖ్యాత సంస్థలు ఏపీకి క్యూ కడుతున్నాయని చంద్రబాబు తెలిపారు. గూగుల్, టాటా–టీసీఎస్ వంటి దిగ్గజాలు విశాఖకు వచ్చాయని, త్వరలోనే ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్ డేటా సెంటర్లకు శంకుస్థాపన చేయబోతున్నామని ప్రకటించారు. అలాగే ఎన్టీపీసీ ఆధ్వర్యంలో రూ.1.85 లక్షల కోట్లతో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్, టాటా సంస్థ ద్వారా రూ.6 వేల కోట్ల పెట్టుబడితో మరో యూనిట్ రాబోతోందని చెప్పారు. పెట్టుబడిదారులకు భరోసా కల్పించేందుకు ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని సీఎం ఉద్ఘాటించారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ ఎకోసిస్టమ్, విశాఖలో ఐటీ హబ్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా యువత నైపుణ్యాలకు పదును పెడుతున్నామని అన్నారు.

**వైద్యం – పర్యాటకం**

రాష్ట్రంలో వైద్య రంగాన్ని బలోపేతం చేస్తున్నామని, పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) విధానంలో మెడికల్ కాలేజీలను నిర్మిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. పీపీపీ అంటే ప్రైవేట్ పరం కాదని, అది ప్రభుత్వ ఆస్తిగానే ఉంటుందని స్పష్టత ఇచ్చారు. గత పాలకులు మెడికల్ కాలేజీలకు కనీసం భూమిని కూడా చూపించలేకపోయారని విమర్శించారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.2.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. ఇక పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించామని, సూర్యలంక, గండికోట వంటి ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.

**ఎక్సైజ్ ప్రక్షాళన**

గత ప్రభుత్వ హయాంలో ఎక్సైజ్ శాఖలో అతిపెద్ద కుంభకోణం

జరిగిందని, నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీశారని సీఎం మండిపడ్డారు. దీనిపై కేబినెట్ సబ్ కమిటీ విచారణ జరుపుతోందని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రస్తుతం పారదర్శక విధానంతో అంతర్జాతీయ బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. విద్యా రంగంలోనూ తెలుగు భాషను కాపాడుకుంటూనే, ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# యుద్ధ విధ్వంసం

ప్రతిగా క్షిపణులు, డ్రోన్లతో ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేసింది.

అమెరికా–ఇజ్రాయెల్ దాడుల కారణంగా ఇప్పటిదాకా 1,045 మంది మరణించినట్లు ఇరాన్ మృత వీరులు, వెటరన్స్ ఫౌండేషన్ వెల్లడించింది.

ఇరాన్ తదుపరి సుప్రీం నేతగా ఖమేనీ కుమారుడు మొజ్తాబా ఖమేనీ ఎన్నిక కానున్నట్లు తెలుస్తోంది.

పశ్చిమాసియాలో సైనిక, ఆర్థిక వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేస్తామని ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జీసీ) తీవ్రంగా హెచ్చరించింది.

**నిద్రలేపిన బాంబు దాడులు**

టెహ్రాన్‌లో తెల్లవారుజాము నుంచే అమెరికా–ఇజ్రాయెల్ బాంబు దాడులు ప్రారంభించాయి. గగనతలంలో యుద్ధ విమానాలు భారీ శబ్దాలతో దూసుకొచ్చాయి. రాజధాని మధ్యలో భవనాలు నేలమట్టమవుతున్న దృశ్యాలను ఇరాన్ టీవీలు చూపించాయి. షియాల కేంద్రమైన ఖోమ్‌తోపాటు పలు నగరాలపైనా దాడులు జరిగాయి.

టెహ్రాన్ తూర్పు ప్రాంతంలో ఉన్న ఇరాన్ సైనిక ప్రధాన కేంద్రంపై ఇజ్రాయెల్ 100 ఫైటర్ జెట్లతో 250 బాంబులు వేసింది. ఇక్కడే ఐఆర్‌జీసీ, ఖుద్స్ ఫోర్స్, నిఘా డైరెక్టరేట్, బసీజ్ పారామిలిటరీ ఫోర్స్, ఇరాన్ సైబర్ యూనిట్, ప్రత్యేక బలగాల యూనిట్, అంతర్గత భద్రత యూనిట్ ఉన్నాయి.

టెహ్రాన్ గగనతలంలో ఇరాన్ యుద్ధ విమానం యాక్–130ని తమ ఎఫ్–35తో కూల్చి వేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది.

గత రెండు రోజుల్లో వేల మంది ఇరాన్ సైనికులను అంతమొందించామని ఇజ్రాయెల్ రమత్ డేవిడ్ ఎయిర్‌బేస్ కమాండర్ కర్నల్ అలెఫ్ తెలిపారు.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. హెజ్‌బొల్లా మిలిటెంట్లు తమపై చేసిన దాడులకు ప్రతీకారంగా ఈ దాడులు చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది. లెబనాన్‌లోని బాల్‌బెక్‌లో ఓ ఇంటిపై బాంబులు పడటంతో ఐదుగురు మృతి చెందారు. బీరుట్‌పైనా భారీగా వైమానిక దాడులు జరిగాయి. ఈ దాడుల్లో ఆరుగురు మరణించారు.

మంగళవారం రాత్రి జరిపిన దాడుల్లో ఇరాన్‌లోని ఇస్ఫహాన్‌లో ఉన్న క్షిపణుల నిల్వ, ఉత్పత్తి కేంద్రం ధ్వంసమైందని ఇజ్రాయెల్ వెల్లడించింది.

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా ఎవరు ఎన్నికైనా వారిని లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ స్పష్టం చేశారు.

గత జనవరిలో ఇరాన్‌లో జరిగిన అల్లర్లను అణచివేసిన ఘటనల్లో పాల్గొన్న పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్ వాలంటీర్ బలగాలకు చెందిన భవనాలను కూల్చేశామని ఇజ్రాయెల్ తెలిపింది.

**అణ్వస్త్ర కేంద్రం ధ్వంసం**

టెహ్రాన్‌లో ఉన్న రహస్య అణ్వస్త్ర కేంద్రాన్ని మంగళవారం ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం (ఐడీఎఫ్) వెల్లడించింది. 2025లో తాము చేసిన దాడుల్లో ధ్వంసమైన ఈ ప్లాంటును ఇరాన్ మళ్లీ నిర్మించుకుందని తెలిపింది. టెహ్రాన్ శివార్లలో ఉన్న ఈ ప్లాంటు పేరు మిన్జాదే అని ఐడీఎఫ్ అధికార ప్రతినిధి ఎఫీ డెఫ్రిన్ తెలిపారు.

ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. తమ రక్షణ వ్యవస్థలు వాటిని అడ్డుకున్నాయని ఇజ్రాయెల్ ప్రకటించింది. జెరూసలెంలో భారీపేలుళ్లు చోటుచేసుకున్నాయి.

పశ్చిమాసియాలోని మౌలిక వసతులపై ఇరాన్ దాడులు చేస్తోంది. సౌదీ అరేబియాలోని రస్ తనూరా చమురు శుద్ధి కేంద్రంపై మరోసారి డ్రోన్ దాడి చేసింది. అయితే ఎటువంటి నష్టం జరగలేదని, చమురు సరఫరాకు అంతరాయం కలగలేదని సౌదీ ప్రభుత్వం వెల్లడించింది.

దుబాయ్‌లోని అమెరికా కాన్సులేట్‌పైనా డ్రోన్లను ఇరాన్ ప్రయోగించింది. దీంతో ఆ భవనానికి కొంత నష్టం జరిగింది. బుధవారం ఉదయం బహ్రెయిన్ అంతటా ఎయిర్ సైరన్లు మోగాయి.

ఖతార్‌పైకి 2 బాలిస్టిక్ క్షిపణులను ఇరాన్ ప్రయోగించింది. అందులో ఒకటి అల్–ఉదైద్ వైమానిక స్థావరంపై పడింది. అయితే ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.

ఇరాన్‌కు మద్దతుగా ఇరాక్‌లోని సరయా ఆలియా అల్–దామ్ గ్రూపు.. జోర్డాన్‌పై డ్రోన్ దాడులు చేసింది.

తమ దేశంవైపు దూసుకొచ్చిన ఇరాన్ బాలిస్టిక్ క్షిపణిని దేశంలోకి ప్రవేశించకముందే నాటో దళాలు కూల్చేశాయని తుర్కియే వెల్లడించింది. ఈ దాడిని నాటో దేశాలు ఖండించాయి. హర్మూజ్ జల సంధిలోని ఒమన్ ఉత్తర తీరంలో బ్రిటన్ వాణిజ్య నౌకపై ప్రొజెక్టైల్‌తో దాడి జరిగింది. దీంతో ఇంజిన్ గదిలో మంటలు చెలరేగాయి. అయితే ఎటువంటి నష్టం జరగలేదని సమాచారం.

**వేల లక్ష్యాలపై దాడులు**

ఇరాన్‌లోని 2,000 లక్ష్యాలపై ఇప్పటిదాకా దాడులు చేశామని యూఎస్ సెంట్రల్ కమాండ్ అధిపతి అడ్మిరల్ బ్రాడ్ కూపర్ తెలిపారు. ఇందుకోసం 2,000కుపైగా యూనిట్ల మందు గుండు సామగ్రిని వినియోగించామని వెల్లడించారు. ఇరాన్ వైమానిక దళాన్ని నిర్వీర్యం చేశామని, వందల బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లు, లాంఛర్లను ధ్వంసం చేశామని వివరించారు.

500 బాలిస్టిక్ క్షిపణులను, 2,000 డ్రోన్లను ఇప్పటిదాకా ఇరాన్ ప్రయోగించిందని కూపర్ తెలిపారు.

**‘గగనతల రక్షణ వ్యవస్థలను ఇరాన్ ఛేదించవచ్చు’**

గల్ఫ్ దేశాలకు తాము గగనతల రక్షణ వ్యవస్థలను అందిస్తున్నప్పటికీ ఇరాన్ క్షిపణులు వాటిని ఛేదించవచ్చని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ పేర్కొన్నారు. అయితే అమెరికా బలగాలను, మిత్ర దేశాలను రక్షించే విషయంలో ఎంతదాకైనా వెళ్తామని తెలిపారు. ‘అంటే దీనర్థం మేం అన్నింటినీ ఆపేస్తామని కాదు. తీవ్ర దాడులకు ముందే గరిష్ఠంగా రక్షణ వ్యవస్థలను సమకూరుస్తాం’ అని వివరించారు. యుద్ధం ఫలానా సమయంలో ముగుస్తుందని చెప్పలేమని వ్యాఖ్యానించారు. కొన్ని నెలలపాటు జరగవచ్చని అభిప్రాయపడ్డారు.

## పీపీపీ విధానంపై జగన్ అసత్య ప్రచారం

-మొదటిపేజీ తరువాయి
10 వైద్య కళాశాలల్ని పీపీపీ విధానంలో నిర్మించేందుకు నిర్ణయించాం. రెండేళ్లలో రెండు దశల్లో వీటిని పూర్తి చేయనున్నాం. తొలి దశలో ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, రెండో దశలో పార్వతీపురం, నర్సీపట్నం, పాలకొల్లు, అమలాపురం, బాపట్ల, పెనుగొండ కళాశాలల్ని పూర్తి చేస్తాం. కొత్త వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్రం వయబిలిటీ ఫండింగ్ కింద సాయం అందించేందుకు ముందుకొచ్చింది. వైకాపా ప్రభుత్వం 420 పడకలతో ఏటా 100 ఎంబీబీఎస్ ప్రవేశాలకు ప్రతిపాదించింది. కూటమి ప్రభుత్వం 625 పడకలతో 150 ప్రవేశాలు కల్పించాలని నిర్ణయించింది. కన్వీనర్ కోటాలో మొత్తం 110 సీట్లు పేద విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయి. అనుబంధ ఆసుపత్రుల్లో 70 శాతం పడకలతో ఉచిత వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి’ అని పేర్కొన్నారు.

**ఏప్రిల్ నుంచి యూనివర్సల్ హెల్త్ పాలసీ..**

‘రాష్ట్రంలో వ్యక్తి కేంద్రంగా వైద్యరంగాన్ని ముందుకు తీసుకెళుతున్నాం. దేశంలోనే హెల్త్ రికార్డుల్లో ఏపీ నంబర్‌వన్‌గా ఉంది. ఏప్రిల్ నుంచి యూనివర్సల్ హెల్త్ పాలసీని అమలు చేయబోతున్నాం. 24 క్రిటికల్ కేర్ సెంటర్లను కేంద్రం మంజూరు చేసింది. ఇందులో 14 ప్రారంభించాం. మిగతావి ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి తీసుకొస్తాం. కల్తీని నివారించేందుకు తిరుమలలో రాష్ట్రస్థాయి ఫుడ్ ల్యాబొరేటరీని మంజూరు చేశాం.

తనిఖీ కేంద్రాల్లో 150 పోస్టుల్ని మంజూరు చేశాం.

2014–19 మధ్య 60 సీహెచ్‌సీ కేంద్రాల ఉన్నతీకరణకు నిధులు కేటాయిస్తే వైకాపా ప్రభుత్వం వాటిని నిలిపేసింది. ఇప్పుడు వాటన్నింటినీ పూర్తి చేయబోతున్నాం.

రాష్ట్రంలో డయాలసిస్ బెడ్లను 550 నుంచి 726కి పెంచ్?యం కొత్తగా 14 డయాలసిస్ సెంటర్లను మంజూరు చేశాం. వైకాపా ప్రభుత్వం దిగిపోయే నాటికి వైద్యశాఖ అనుబంధ రంగాల్లో 14 వేల పోస్టులు ఖాళీగా ఉంటే జీరో వేకెన్సీ విధానాన్ని అమలు చేసినట్లు జగన్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. 20 నెలల్లో 8,600 పోస్టుల్ని భర్తీ చేశాం. బదిలీల్లోనూ పారదర్శక విధానాన్ని అనుసరిస్తున్నాం.

ఎన్టీఆర్ వైద్య సేవ కింద.. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో ఖర్చు పెట్టిన దాంట్లో 61 శాతం 20 నెలల్లోనే వెచ్చించాం.

190 ...108 అంబులెన్స్‌లను కొత్తగా తీసుకొచ్చాం.

2.5 లక్షల మందికి టెలిమెడిసిన్ ద్వారా వైద్యసేవలు అందించాం.

వైకాపా హయాంలో 108 అంబులెన్స్‌లు 9.5 నిమిషాల నుంచి 3 నిమిషాల వరకు ఆలస్యంగా నడిచేవి. దాన్ని 0.6 నిమిషాలకు తగ్గించాం. గోల్డెన్ అవర్‌కు సంబంధించి 4,380 కేసుల్లో 4,160 మంది ప్రాణాలు కాపాడాం” అని సత్యకుమార్ యాదవ్ వివరించారు.

## ఇవి అడ్రస్ లేని కంపెనీలా?

-మొదటిపేజీ తరువాయి
టీమ్–11 తప్పుడు ప్రచారం చేస్తోందంటూ మండిపడ్డారు. కేవలం రాజకీయ విద్వేషంతోనే మంచి కంపెనీలపై బురదజల్లుతున్నారని, కోర్టులకు వెళ్లి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.విశాఖపట్నాన్ని గ్లోబల్ ఐటీ మ్యాప్‌లో నిలపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు. ఐదేళ్లలో ఒక్క ఐటీ రంగంలోనే 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశాన్ని ఒక సవాలుగా తీసుకున్నామని తెలిపారు. ఇప్పటికే రూ.1.50 లక్షల కోట్ల విలువైన 52 ఎంవోయూలు కుదుర్చుకున్నామని, తద్వారా 2.3 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు నరేంద్ర మోదీ టాటా నానో ఫ్యాక్టరీ కోసం రూపాయికే భూమి ఇచ్చి, తద్వారా భారీ ఆటోమొబైల్ ఎకో సిస్టమ్‌ను ఎలా సృష్టించారో.. అదే స్ఫూర్తితో ఏపీలోనూ ‘లిఫ్ట్’ పాలసీని తీసుకొచ్చామన్నారు. టాప్–500 కంపెనీలు వచ్చి భారీగా ఉద్యోగాలు ఇస్తే ఉచితంగానైనా భూమి ఇచ్చేందుకు సిద్ధమని ప్రకటించారు.గత ప్రభుత్వం ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలపై ఒక యుద్ధమే చేసిందని మంత్రి ధ్వజమెత్తారు. 2014–19 మధ్య చంద్రబాబు కృషితో విశాఖకు వచ్చిన ఒక ఫార్చ్యూన్–500 కంపెనీపై ఆనాడు వైసిపి నేతలు పార్లమెంటులో చేసిన నిరాధార ఆరోపణల వల్ల.. సదరు కంపెనీ సీఈవో తీవ్ర ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. గత ఐదేళ్లలో ఒక్క ఐటీ కంపెనీకి కూడా ఇన్సెంటివ్స్ ఇవ్వకుండా టెర్రరిజాన్ని తలపించేలా పాలన సాగించారని ఆరోపించారు.చంద్రబాబు అనుభవమే బ్రాండ్‌గా పెట్టుబడులు తెస్తున్నామని లోకేశ్ పేర్కొన్నారు. తాము అధికారంలోకి రాగానే కాగ్నిజెంట్ సీఈవోతో మాట్లాడి ఒప్పించామని, ఫలితంగా విశాఖలో 25 వేల ఉద్యోగాల కల్పనకు ఆ సంస్థ ముందుకొచ్చిందన్నారు. అలాగే గూగుల్ మెగా డేటా సెంటర్, టీసీఎస్ డెవలప్‌మెంట్ సెంటర్, ఆసిప్ సెమీకండక్టర్ యూనిట్ వంటివి విశాఖ కేంద్రంగా రాబోతున్నాయన్నారు. “రాజకీయాలు రాష్ట్రం లోపల చేద్దాం.. బయటకు వెళ్లినప్పుడు రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరం కలిసి పనిచేద్దాం” అని ప్రత్యర్థి పక్షానికి మంత్రి హితవు పలికారు. మీకు తెలిసిన కంపెనీలు ఉంటే చెప్పండి, పర్సనల్‌గా ఫాలో అప్ చేసి వాటిని రాష్ట్రానికి తెచ్చే బాధ్యత నాది అని లోకేశ్ ఆఫర్ ఇచ్చారు.

## అఫ్గాన్‌లో బగ్రామ్ వైమానిక స్థావరంపై పాక్ దాడి

-మొదటిపేజీ తరువాయి
కథనాలు వెలువడ్డాయి. ఆపరేషన్ గజబ్ లిల్ హక్ పేరుతో గత నెల 26 నుంచి అఫ్గాన్‌పై పాక్ దాడులు జరుపుతున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగానే బగ్రామ్‌ను లక్ష్యంగా చేసుకుంది. అఫ్గాన్ రక్షణ శాఖ కూడా ఈ దాడులను ధ్రువీకరించింది. గత వారం రోజుల్లో తమ దేశంలోని సైనిక లక్ష్యాలపై పాక్ 50కిపైగా వైమానిక దాడులు జరిపినట్లు వెల్లడించింది.

## బాణసంచా పేలుళ్ల ఘటనల్లో నిర్వాహకుల ఆస్తులు జప్తు చేస్తాం

-మొదటిపేజీ తరువాయి
జరిగిన బాణసంచా పేలుళ్ల ప్రమాదాల నేపథ్యంలో ప్రభుత్వం ఈ విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరిస్తుందని ఆమె పేర్కొన్నారు. శాసనసభలో ఏపీ అగ్నిమాపక సేవల చట్టం సవరణ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు, సభ ఆమోదించాక ఆమె మాట్లాడారు. ‘అగ్ని ప్రమాద నివారణ చర్యలకు సంబంధించి చట్టంలో మార్పులు చేస్తున్నాం. ఆధునిక భవన నిర్మాణాలు, బహుళ అంతస్తులు పెరగడంతో చట్టంలో మార్పులు అనివార్యమయ్యాయి. నిబంధనలు అతిక్రమిస్తే భవన ప్రాంగణాన్ని సీజ్ చేసి చర్యలు తీసుకుంటాం’ అని హోంమంత్రి హెచ్చరించారు. చర్చలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తెనాలి శ్రావణ్‌కుమార్, పార్థసారథి పాల్గొని మాట్లాడారు.

## 26 రకాల వివరాలతో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు

-మొదటిపేజీ తరువాయి
ఆధార్, రైస్ కార్డ్, మొబైల్ నెంబర్, విద్యార్హతలు, వృత్తి, చిరునామా, వ్యవసాయ భూమి, ఇతర ఆస్తుల వివరాలు వంటి మొత్తం 26 రకాల అంశాలతో పకడ్బందీగా డేటాబేస్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ డేటాబేస్ రూపకల్పన కోసం ఎస్‌జీఎస్‌డబ్ల్యూ, డిస్కమ్స్, పురపాలక శాఖ, వెబ్‌ల్యాండ్, వాహన్, హెచ్‌ఆర్‌ఎంఎస్, పంచాయతీరాజ్, మార్క్‌ఫెడ్ వంటి వివిధ ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని సేకరించి ఇందులో పొందుపరచాలని సీఎం సూచించారు. ప్రస్తుతం 82 శాతం సమాచారం సిద్ధంగా ఉందని, వచ్చే ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటాబేస్ పూర్తిచేస్తామని అధికారులు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి.. ప్రభుత్వంలోని అన్ని శాఖల వద్ద ఉన్న డేటాను సమీకృతం చేయడం ద్వారానే సమాచారంలో కచ్చితత్వం పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ‘ఫ్యామిలీ కార్డు’ అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దీనికి అనుగుణంగా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఐపీఎల్‌లో సీఎస్‌కేకు విజిల్ వేస్తే ఎన్నికల్లో టీవీకే విజిల్‌కు ఓటేస్తారు

-మొదటిపేజీ తరువాయి
అధ్యక్షుడు విజయ్ అన్నారు. ఈసారి జరగబోయే ఎన్నికలు మిగతా పార్టీ వారికి సాధారణమే అన్నారు. తమకు మాత్రం ఒక భావోద్వేగమని వ్యాఖ్యానించారు. తంజావూరు జిల్లాలో జరిగిన బహిరంగ ర్యాలీలో పార్టీ మేనిఫెస్టోను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో ఢిల్లీ టీమ్ బీజేపీతో పాటు అన్ని జట్లను టీవీకే ఓడిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఐపీఎల్ క్రికెట్‌లో తమిళనాడు చెన్నై సూపర్ కింగ్స్‌కు విజిల్ వేస్తే ఈ ఎన్నికల్లో టీవీకే విజిల్ గుర్తు మారుమోగుతుందని అన్నారు. ప్రజలకు తనతో ఉన్న అనుబంధాన్ని ఎవరూ విడదీయలేరని అన్నారు. ఈ సందర్భంగా తాను అధికారంలోకి వస్తే ఏమేం చేస్తానో హామీలు ఇచ్చారు. రెండెకరాల లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతు బిడ్డల ఉన్నత విద్యకు అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. అయితే ఆ కుటుంబాల్లో ఏ ఒక్కరికీ ప్రభుత్వ ఉద్యోగం ఉండకూడదనే నిబంధనను కూడా ఆయన స్పష్టం చేశారు. ఉన్నత విద్య కోసం భారీగా ఖర్చు చేయలేని పేద కుటుంబాలకు సహకరించాలనేది తన ఉద్దేశమని చెప్పారు. మత్స్యకారుల కుటుంబాలకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. అవినీతికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మోదీ ఇజ్రాయెల్ ను వీడిన 48 గంటల తర్వాత ఇరాన్‌పై దాడి...

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన అనంతరం ఇరాన్‌పై దాడులు జరగడంపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఫిబ్రవరి 25, 26 తేదీలలో మోదీ రెండు రోజుల పాటు పర్యటించారు. మోదీ పర్యటన ముగిసిన రెండు రోజుల తర్వాత అంటే ఫిబ్రవరి 28న ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. ఈ దాడుల గురించి మోదీకి తెలుసని ఇలా వివిధ రకాల ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ స్పందించారు. ఇరాన్‌పై దాడికి, మోదీ పర్యటనకు సంబంధం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరాన్‌పై దాడి ఒక ఆపరేషనల్ అవకాశమని అన్నారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ నుంచి వెళ్లిపోయాక ఆ అవకాశం వచ్చిందని తెలిపారు. మోదీ ఇజ్రాయెల్ పర్యటనలో దేశాభివృద్ధి గురించి మాత్రమే చర్చించామని, యుద్ధం గురించి ఆయనతో చర్చించలేదని స్పష్టం చేశారు.

## ఇరాన్ సుప్రీం లీడర్? ఎవరైనా చావే గతి..

-మొదటిపేజీ తరువాయి
కాట్జ్ చేసిన ఈ ప్రకటనతో ప్రపంచ దేశాలన్నీ యుద్ధ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి. భవిష్యత్తులో ఏ ఇరాన్ సుప్రీం నాయకుడైనా బతికి బట్టకట్టేది లేదని ఇజ్రాయెల్ తేల్చి చెప్పింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా అలీ అయతుల్లా ఖమేనీ పెద్ద కొడుకు మోజ్తాబా ఖమేనీ (56) ఎన్నికైనట్లుగా ఇరాన్ మీడియాలో వార్తలొచ్చాయి. మోజ్తాబా ఖమేనీ ఎన్నికైనట్టుగా ప్రచారం జరిగిన గంటల వ్యవధిలోనే ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి తన అధికారిక ‘ఎక్స్’ ఖాతాలో ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎవరు ఎన్నికైనా టార్గెట్ చేస్తామని, చావు తప్పదని కీలక హెచ్చరిక చేయడం గమనార్హం. ఇజ్రాయెల్‌ను నాశనం చేయడానికి, అమెరికాను బెదిరించడానికి, ఇరాన్ ప్రజలను అణచివేయడానికి ప్రయత్నించే ఎవరినైనా అంతం చేస్తామని కాట్జ్ తన ‘ఎక్స్’ ఖాతాలో పోస్ట్ చేశారు. తదుపరి సుప్రీం నాయకుడిని ఎన్నుకునే బాధ్యత నిర్వర్తించే ఇరాన్ నిపుణుల అసెంబ్లీతో సంబంధం ఉన్న బిల్డింగ్?ను ఇజ్రాయెల్ టార్గెట్ చేసింది. టార్గెట్ చేసిన కొంతసేపటికే ఈ హెచ్చరిక వచ్చింది. ఇరాన్ సుప్రీం లీడర్.. 86 ఏళ్ల అయతుల్లా అలీ ఖమేనీ ఇప్పటికే ఇజ్రాయెల్ దాడుల్లో మృతి చెందిన సంగతి తెలిసిందే.

## అమెరికాకు గట్టి ఎదురుదెబ్బ... కీలక రాడార్ స్టేషన్ ధ్వంసం చేసిన ఇరాన్!

మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ తీవ్ర దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో అమెరికాకు చెందిన కీలకమైన కమ్యూనికేషన్, రాడార్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ముఖ్యంగా, ఖతార్ లో అమెరికాకు అత్యంత కీలకమైన రాడార్ స్టేషన్ ఇరాన్ దాడుల్లో ధ్వంసమైనట్టు తెలుస్తోంది. ఇప్పటికే యుద్ధ వాతావరణంతో అట్టుడుకుతున్న ప్రాంతంలో ఈ దాడులతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.న్యూయార్క్ టైమ్స్ విశ్లేషణ ప్రకారం, కనీసం ఏడు అమెరికా సైనిక స్థావరాల్లోని కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. శాటిలైట్ చిత్రాలు, ధృవీకరించిన వీడియోల ఆధారంగా ఈ నివేదిక వెల్లడించింది. బాలిస్టిక్ క్షిపణులను గుర్తించే వ్యవస్థలు, శాటిలైట్ డిష్‌లు, సున్నితమైన పరికరాలను కాపాడే రాడోమ్‌ల వద్ద నష్టం స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొంది. అమెరికా సైనిక సమాచార వ్యవస్థ అత్యంత రహస్యంగా ఉన్నప్పటికీ, లక్ష్యాలను బట్టి చూస్తే వారి కమ్యూనికేషన్ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే ఇరాన్ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేస్తున్నాయి. వీటికి ప్రతీకారంగానే తాము ఈ దాడులు చేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. బహ్రెయిన్, కువైట్, సౌదీ అరేబియా, యూఏఈలోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ విరుచుకుపడుతోంది.గత జూన్‌లో కూడా ఖతార్‌లోని ఒక అమెరికా స్థావరంపై ఇరాన్ దాడి చేసి కమ్యూనికేషన్ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుంది. ఇప్పుడు మళ్లీ అదే స్థావరంపై దాడి చేయడం గమనార్హం.

# ఆప్కో ఆధ్వర్యంలో ప్రత్యేక చేనేత కౌంటర్లను ప్రారంభించిన మంత్రి సవిత.





- 50 శాతం డిస్కౌంట్లతో చేనేత వస్త్రాల అమ్మకాలు.
- చేనేత రంగ అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం.
- ఏప్రిల్ 1 నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నాం.



**అమరావతి, పెన్ సత్తా, మార్చి 04:**అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి విశేష స్పందన లభించింది.

మహిళా దినోత్సవం సందర్భంగా ఉద్యోగులకు రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేక చేనేత స్టాళ్లు ఏర్పాటు చేసి, 50 శాతం డిస్కౌంట్ పై చేనేత వస్త్రాల అమ్మకాలను మంత్రి సవిత బుధవారం ప్రారంభించారు. ప్రత్యేక చేనేత స్టాళ్లకు సచివాలయ ఉద్యోగుల నుంచి విశేష స్పందన. ప్రఖ్యాత గాంచిన వెంకటగిరి, గద్వాల్, మదనపల్లె, ఉప్పాడ, ధర్మవరం, మంగళగిరి పట్టు, కాటన్ చీరలు, షర్ట్ లు, ఇతర రెడీమేడ్ చేనేత వస్త్రాల విక్రయం ఈ స్టాళ్లలో చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేసిన చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, ఇతర అధికారులు, రాష్ట్ర సచివాలయం మహిళా ఉద్యోగ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# భాషోత్సవాలలో ఆకట్టుకున్న భువనవిజయం

మండలవిద్యాశాఖాధికారి 1 కే.నరేష్




**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 04:** ప్రాధమిక,ఉన్నత పాఠశాలలో మండలస్థాయి భాషోత్సవ పోటీలను బుధవారం నిర్వహించారు.

భాషోత్సవాలు సందర్భంగా పలు పాఠశాలల విద్యార్ధులకు పద్యపఠనం, లఘునాటికలు, కధాపోటీలు నిర్వహించారు.జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలమేరకు మండలస్థాయి భాషోత్సవాల పోటీలను మండల విద్యాశాఖాధికారి. పర్యవేక్షణలో స్ధానిక బాలికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా బాలికోన్నత పాఠశాల విద్యార్ధులు వేసిన భువన విజయం రూపకం పలువురుని ఆకట్టుకుంది. అనంతరం తెలుగులో పద్యపఠనం ,వ్యాసరచన, కధల పోటీలు తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, విజయలక్ష్మి, కాంతమ్మలు నిర్వహించారు. ఆంగ్లభాషలో వ్యాసరచన, డిబేట్, రోల్ ప్లే, సంభాషణ వంటి పోటీలను టి.శేషగిరిరావు, ప్రియదర్శిని, హిందీ భాషలో పోటీలను ఝాన్సీభాయి లు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్ధులను జిల్లా స్ధాయిలో పాల్గొనవలసి ఉంటుందని అన్నారు. విద్యార్ధులలో పోటీతత్వం పెరగడానికి ఇటువంటివి దోహదపడతాయని విద్యాశాఖ అధికారి కే నరేష్ అన్నారు. మండలంలో ఎక్కువ పాఠశాలలనుండి అధికసంఖ్యలో ఈ పోటీలలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు.పాఠశాల ఇన్ ఛార్జ్ హెచ్.ఎమ్ కే.రాణి ,తెలుగుఉపాధ్యాయులు రాజశేఖర్,కే.లోవలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య రక్షణ కల్పించడం చారిత్రాత్మక నిర్ణయం



- ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ.
- గత ప్రభుత్వం మెడికల్ కాలేజీల కోసం ఖర్చు చేసింది కేవలం 18 శాతమే.
- నిలిచిపోయిన వైద్య కళాశాలలకు కూటమి రూ. 787 కోట్లు విడుదల చేసింది.
- 11 మెడికల్ కాలేజీల పూర్తికి రూ. 11,000 కోట్లు అవసరం.
- పీపీపీ మోడల్ ద్వారానే ఇది సాధ్యం.
- పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదు భూమి, సీట్లు, ఫీజు నియంత్రణ ప్రభుత్వం వద్దే.

**అమరావతి, పెన్ సత్తా, మార్చి 04:**ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య రక్షణ కల్పించడం చారిత్రాత్మక నిర్ణయం అని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు . బుధవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఆరోగ్య శాఖ పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) మోడల్‌ను సమర్ధించారు. కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 25 లక్షల రూపాయల వరకు ఆరోగ్య రక్షణ కల్పించాలనే యూనివర్సల్ హెల్త్ కవరేజ్ నిర్ణయం చారిత్రాత్మకమని ఆయన కొనియాడారు. కేవలం ఇన్సూరెన్స్ పథకాలే కాకుండా, నాణ్య మైన వైద్యులు, అత్యాధునిక ఆసుపత్రులు, సమర్ధవంత మైన ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఉన్నప్పుడే ప్రజలకు నిజమైన భరోసా లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. 2019-24 మధ్య కాలంలో 17 మెడికల్ కాలేజీలను మంజూరు చేశామని గొప్పలు చెప్పుకున్న వైసీపీ, కేవలం పేపర్ మీద ప్రకటనలకే పరిమితమైందని ధ్వజమెత్తారు. కాలేజీల నిర్మాణం కోసం 8,480 కోట్లు అవసరమని అంచనా వేసి, కేవలం 1,550 కోట్లు మాత్రమే ఖర్చు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. మిగిలిన 6,152 కోట్లు ఖర్చు చేయకుండా కాలేజీలను గాలికి వదిలేసి, మరోవైపు సలహాదారులకు 650 కోట్ల రూపాయలు, రిషికొండ ప్యాలస్ నిర్మాణానికి వందల కోట్లు ఖర్చు చేయడం వారి ప్రాధాన్యతలను తెలియజేస్తోందని ఎద్దేవా చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే నిలిచిపోయిన మెడికల్ కాలేజీల అభివృద్ధి కోసం 787 కోట్లు విడుదల చేసిందని, ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిబద్ధతకు నిదర్శనమని వెంకట్రావ్ పేర్కొన్నారు. పక్క రాష్ట్ర మైన తెలంగాణలో 2019-24 మధ్య 5,500 కోట్లు ఖర్చు చేసి 17 మెడికల్ కాలేజీలను ఆపరేషన్ లోకి తెచ్చారని, ఫైనాన్షియల్ సస్టైనబుల్ మోడల్‌ను వారు అనుసరించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో మిగిలిపోయిన 11 వైద్య కళాశాలలను పూర్తి చేయడానికి 11,000 కోట్లు, వాటి వార్షిక నిర్వహణ కోసం ఏటా 2700 కోట్లు అవసరమవుతాయని, పదేళ్ల కాలంలో దాదాపు 27,500 కోట్లు వెచ్చించే ఆర్ధిక పరిస్థితి రాష్ట్రానికి లేనందునే దూరదృష్టితో పీపీపీ మోడల్‌ను ఎంచుకున్నామని ఆయన వివరించారు. పీపీపీ మోడల్ అనేది కొత్తదేమీ కాదని, మణిపాల్ కస్తూరిభాయ్ మెడికల్ కాలేజ్, రామచంద్ర మెడికల్ కాలేజ్, అమృత ఇన్స్టిట్యూట్ వంటి ప్రముఖ సంస్థలు దశాబ్దాలుగా ఇదే పద్ధతిలో నడుస్తున్నాయని తెలిపారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి ఎన్నో రాష్ట్రాలు ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాయని, అవగాహన లేకుండా వైసీపీ నేతలు సంతకాల సేకరణ చేయడం హాస్యాస్పదమని విమర్శించారు. పీపీపీ విధానంలో భూమి ప్రభుత్వం వద్దే ఉంటుందని, సీట్ల కేటాయింపు, ఫీజు నియంత్రణ, రిజర్వేషన్ పాలసీలు అన్నీ ప్రభుత్వ పర్యవేక్షణలోనే జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల ఆర్ధిక భారం తగ్గడమే కాకుండా, పనుల్లో వేగం పెరిగి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చివరగా తన నియోజకవర్గం లో రోడ్డు ప్రమాదాల బారిన పడి అనేక మంది మరణిస్తున్నారని వారిని ఆదుకోవడానికి ఒక ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, అలాగే ఒక డయాలిసిస్ సెంటర్‌ను కేటాయించాలని మంత్రిని కోరారు.తన నియోజక వర్గంలో 65 వేల మందికి సిహెచ్సి పిహెచ్సి సెంటర్ ల ఆధ్వర్యం లో ఇంటి వద్దే రక్త పరీక్షలు నిర్వహించమని అలానే రాష్ట్ర వ్యాప్తంగా ఇంటి వద్దే రక్త పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత మంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఉపాధ్యాయులకు అండగా పి ఆర్ టి యు



**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 04 :** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పి ఆర్ టి యు అండగా ఉంటుందని నక్కపల్లి మండల శాఖ అధ్యక్షులు టి. వి. రమణ అన్నారు. బుధవారం పి ఆర్ టి యు నక్కపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఒడ్డిమెట్ట, దేవవరం, గొడిచెర్ల, ఉద్దండపురం, నెల్లిపూడి, డి. ఎల్. పురం, చినదొడ్డిగల్లు, వేంపాడు, రమణయ్య పేట తదితర ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల ను సందర్శించి పి ఆర్ టి యు సభ్యత్వాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు ను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చి ఉపాధ్యాయులు కు సభ్యత్వాన్ని ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి పి. శివాజీ, ఉపాధ్యక్షులు సి. హెచ్. ప్రసాద్, మండల కార్యవర్గ సభ్యులు ఎస్. రమేష్, పి. వి. రమేష్ బాబు, టి. గోపి, పి. నూకరాజు, జి. నాగదుర్గ, ఎమ్. సత్యనారాయణ, కె. రాజు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్ అవగాహన





**పరవాడ, పెన్ సత్తా, మార్చి 04:**అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కొని బుధవారం పరవాడ పోలీస్ స్టేషన్ పరిధి లోని పలు పాఠశాలల్లో విద్యార్థినుల కోసం సెల్ఫ్ డిఫెన్స్ అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం పరవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. మల్లికార్జున రావు సూచనల మేరకు మహిళా ఎస్ఐ జి.ఎస్.వి. మహాలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. పరవాడ లోని సుమేదా స్కూల్, జాజులవానిపాలెం లోని శ్రీ సాయి విద్యానికేతన్, పరవాడ లోని గవర్నమెంట్ గర్ల్స్ హై స్కూల్ ల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు అత్యవసర పరిస్థితుల్లో దాడులను ఎలా ఎదుర్కోవాలి, ప్రమాదకర పరిస్థితుల నుంచి ఎలా తప్పించుకోవాలి, తమను తాము ఎలా రక్షించు కోవాలి అనే అంశాల పై అవగాహన కల్పించారు.

సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణలో భాగంగా కరాటే మాస్టర్ ప్రసాద్ విద్యార్థినులకు ఆత్మరక్షణకు సంబంధించిన పలు పద్ధతులను ప్రాక్టికల్ డెమోస్ ద్వారా వివరించి నేర్పించారు. అలాగే సుమేదా స్కూల్ పి.ఈ.టి మౌనిక విద్యార్థినులకు శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, సెల్ఫ్ డిఫెన్స్‌లో అవసరమైన మెళకువల పై ప్రత్యేకంగా శిక్షణ అందించారు.

ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థినులు పాల్గొని ఆత్మరక్షణ పద్ధతుల పై అవగాహన పొందారు. మహిళల భద్రత, ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పాఠశాల నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని, నేర్చుకున్న సెల్ఫ్ డిఫెన్స్ పద్ధతులను అవసర మైన సందర్భాల్లో ఉపయోగించు కుంటామని తెలిపారు. మహిళల భద్రత పై అవగాహన కల్పించేందుకు పరవాడ పోలీస్ తరఫున ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని సీఐ తెలిపారు.

# ఆర్ ఎస్ కే ల ద్వారా అపరాలు కొనుగోలు

- వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్



**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి04:** రైతుల పండించిన అపరాలను ఆర్ ఎస్ కె ల ద్వారా కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలం లో డోంకాడ, చీడిక కొత్తూరు గ్రామాల్లో అపరాలు, నువ్వుల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లో అపరాలు సుమారు 1700 ఎకరాల్లో సాగు చేస్తున్నారని చాలా వరకు రైతులు ఇంట్లో అవసరాలకు వాడుకుంటున్నారని అన్నారు. రైతుల వద్ద మిగిలి ఉన్న అపరాలకు ప్రభుత్వం ఇచ్చే కనీస మద్దతు ధర మినుము రూ7800 క్వింటా, పెసర రూ 8768 లు పొందాలి అంటే అపరాలు ఆర్ ఎస్ కే ద్వారా అమ్ముకోవాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అలాగే అపరాల్లో కాయ తొలుచు పురుగు నియంత్రణ కోసం ఎకరానికి 60 మిల్లీ క్లోరాంట్రినిపోల్, నువ్వుల పంట లో వెర్రి తెగులు నియంత్రణ కోసం డై మిథియాట్ 400 మిల్లీ ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ క్షేత్ర పర్యటన లో ఏ ఈ ఓ లు సత్యనారాయణ, సాయి, వ్యవసాయ సహాయకులు సిరిషా, ధనరాజు రైతులు పాల్గొన్నారు.

## పసుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచండి

- 20 వేలు మట్టి పాత్రలు ఏర్పాటు కు కృషి చేస్తున్నాం
- వన్యప్రాణులు వేటగాళ్ల బారిన పడకుండా చర్యలు చేపట్టాలి
- ప్రభుత్వం స్పందించి పశుపక్ష్యాదులకు నీటి వసతి కల్పించాలి
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ







**విశాఖపట్నం, పెన్ సత్తా, మార్చి 04:**పసుపక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచండని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం విశాఖపట్నం జిల్లా ఎంవిపి కాలనీ లోని ఆళ్వార్ దాస్ డిగ్రీ కళాశాల మైదానంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ అధ్యక్షతన పశు పక్ష్యాదులకు నీరు మట్టి పాత్రలలో ఏర్పాటు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ఏడాది పసుపక్ష్యాదులకు నీరు ఏర్పాటు చేయడానికి 20 వేలు మట్టి పాత్రలు ఏర్పాటునకు కృషి చేస్తున్నాం అన్నారు. దేశం లో ప్రతి ఒక్కరూ స్పందించి పశు పక్ష్యాదులకు నీరు అందుబాటులో ఉంచాలని కోరారు. సమస్త జీవరాశిని కాపాడుకుందామన్నారు.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు స్పందించి పశుపక్ష్యాదులకు నీటి వసతి కల్పించాలని కోరారు. విశాఖపట్నం జిల్లా అధికారులు కూడా స్పందించి పశుపక్ష్యాదులకు నీటి వసతి కల్పించాలని కోరారు. పక్షులు కోసం చిరుధాన్యాలు అందుబాటులో ఉంచాలని కోరారు. అడవుల్లో, కొండల మీద, తీర ప్రాంతాలలో వర్షాకాలంలో చిరుధాన్యాలు చల్లి పశుపక్ష్యాదులకు ఆహారం అందుబాటులోకి తీసుకు రావాలని కోరారు. వేసవి కాలంలో నీటి కోసం అడవి నుండి బయటకు వచ్చే వన్యప్రాణుల వేటగాళ్ల బారిన పడకుండా, వేట జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో మ్యాంగో మేన్ అప్పాజీ, స్వాంతన సేవా సంస్థ ప్రతినిధి ప్రజ్ఞాన్ కుమార్, గ్రీన్ క్లైమేట్ టీం వాలంటీర్ జె రాజేశ్వరి, పలువురు లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొని మాట్లాడారు.

## బాపట్లలో రాష్ట్ర ఎస్సీ కమీషన్ సభ్యుల పర్యటన

- ఘనంగా సత్కరించిన జనసేన నాయకులు
- దళితుల సమస్యల పరిష్కారానికి కమీషన్ నిరంతరం కృషి చేస్తుంది
- సభ్యులు గౌతమ్ రాజు,సీతారాం





**బాపట్ల,పెన్ సత్తా,మార్చి 4 :**రాష్ట్ర ఎస్సీ కమీషన్ సభ్యులు గౌతమ్ రాజు,సీతారాం లు బుధవారం బాపట్ల జిల్లాలో పర్యటించారు.ఈ సందర్భంగా బాపట్ల తహసీల్దార్ కార్యాలయంలో వారిని అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు,బాపట్ల జనసేన నాయకులు విన్నకోట సురేష్ మర్యాదపూర్వకంగా కలిసి,కమీషన్ సభ్యులకు దుశ్శలువాలు కప్పి,పుష్ప గుచ్చాలు మరియు గౌతమ బుద్ధుని విగ్రహం అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా విన్నకోట సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఎస్సీ కమీషన్ సభ్యులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బాపట్లకు వచ్చిన గౌతమ్ రాజు మరియు సీతారాం లను కలవడం చాలా సంతోషంగా ఉందన్నారు.అట్టడుగు వర్గాల అభ్యున్నతికి,అట్టడుగు వర్గాల వారికి రాజ్యాంగబద్దంగా లభించచాల్సిన హక్కుల రక్షణకు కమీషన్ పెద్దపీట వేస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.బాపట్ల నియోజకవర్గ పరిధిలో దళితుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని పేర్కొన్నారు.రాష్ట్ర ఎస్సీ కమీషన్ సభ్యులు గౌతమ్ రాజు,సీతా రాం మాట్లాడుతూ.....రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ సామాజిక వర్గాలపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టడంతో పాటు,ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు ప్రతి దళిత బిడ్డకు చేరేలా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.బాపట్ల జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఎస్సీ అట్రాసిటీ కేసులు,భూ సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.బాధితుల నుండి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు.బాపట్ల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ పర్యటనలో స్థానిక అధికారులతో కలిసి ఎస్సీ సామాజిక వర్గానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారించే విషయంలో అధికారులు జాప్యం చేయకూడదని కమీషన్ సభ్యులు సూచించారు.

# ఏపీలో జర్నలిస్టులను విస్మరించము, నిర్లక్ష్యం చేయం.






- సమస్యలు పరిష్కారానికి ముందుంటా.
- దశలవారీగా పరిష్కారం చూపిస్తా.
- జర్నలిస్టుల సంక్షేమ నిధికి 5 లక్షలు విరాళం.
- రాష్ట్ర సమాచార పౌరసరఫరాల మంత్రి కొలుసు పార్థ సారథి.

**విజయవాడ, పెన్ సత్తా, మార్చ్ 04:**
జర్నలిస్టుల పట్ల తమ ప్రభుత్వానికి సానుకూలతే ఉందని, వివిధ సందర్భాల్లో జిల్లాల్లో జర్నలిస్టు సంఘాల నాయకులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను చర్చిస్తుంటామని, ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తుంటామని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కే పార్థసారథి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్), ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీబీజేఏ) సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచీ చాలా పెద్ద సంఖ్యలో హాజరైన జర్నలిస్టులు మహాత్మాగాంధీ రోడ్డు రాఘవయ్య పార్క్ సెంటర్ నుండి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు భారీ ర్యాలీ జరిగింది. అనంతరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకట్రావు అధ్యక్షతన సభ జరిగింది. రాష్ట్ర నాయకులు తెలిపిన ఆయా సమస్యల పై మంత్రి స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి యధాశక్తి కృషి చేస్తానని పేర్కొన్నారు. జర్నలిస్టుల ముఖ్య సమస్యలన్నింటినీ సీఎంతో చర్చించి పరిష్కరించే ప్రయత్నం చేస్తామన్నారు. జర్నలిస్టులను విస్మరించం.. నిర్లక్ష్యం చేయం అని తెలిపారు. జర్నలిస్టుల ఆరోగ్య బీమా పథకంలో అంతరం లేకుండా నిరవధికంగా కొనసాగేలా చూస్తానన్నారు. ఏడాదికి రెండుసార్లైనా జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాలన్న విజ్ఞప్తిని ప్రస్తావిస్తూ ఐఎంఏ, పెద్ద ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించి జర్నలిస్టులకు లబ్ధి కలిగేలా చూస్తామన్నారు. జర్నలిస్టుల సంక్షేమ నిధిని పెంచి ఫలాలు అందేలా.. కార్యాచరణ ఆలోచిస్తామని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. ఈ పథకానికి తాను వ్యక్తిగతంగా ఐదు లక్షల రూపాయలు అందజేస్తానన్నారు. జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాల అభ్యర్థనను ప్రస్తావిస్తూ ఈ వరకే ఉన్న పథకంలో జర్నలిస్టుల్ని కలిపే విషయం సానుకూలంగా పరిశీలిస్తామన్నారు. జర్నలిస్టుల పై దాడుల్ని ఖండించి తీరతామన్నారు. జర్నలిస్టుల పిల్లలకు విద్యాసంస్థల్లో ఉచితంగా అసెంబ్లీలో ప్రతిపక్షం లేకున్నా, మీడియాలో వస్తున్న వివిధ సమస్యలను ప్రభుత్వం చర్చిస్తుంటుందని మంత్రి తెలిపారు. సోషల్ మీడియా, యూట్యూబ్ లలో తరచూ ఫేక్ న్యూస్ వస్తున్నందున మిగతా జర్నలిస్టుల మీద కూడా కొంత విముఖత లేకపోలేదన్నారు. అబద్ధాలు, తప్పుడు వార్తల విషయంలో ఉపేక్షించ బోమని స్పష్టంచేశారు. దేశంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాల కంటే ప్రజల సంక్షేమానికి ఎక్కువ మొత్తంలో కేటాయిస్తోంది ఆంధ్రప్రదేశేనని ఆయన చెప్పారు. "ఫెడరేషన్" ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు మాట్లాడుతూ "సేవ్ జర్నలిజం.. ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ అని జర్నలిస్టుల జాతీయ సంఘం పేర్కొన్న అంశాన్ని తొలుత ప్రస్తావించారు. తమ సంఘంలో 7 వేల మందికి పైగా సభ్యులున్నారంటూ వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను వివరించారు. జర్నలిజం వృత్తి పెద్ద ప్రమాదంలో పడింది. జర్నలిస్టులకున్న కొద్దిపాటి చట్టాలను కూడా కేంద్రం రద్దు చేసింది. మాకు ఏ సదుపాయాలున్నాయో తెలియదు. జర్నలిస్టుల పరిస్థితులు అన్నింటినీ అధ్యయనం చేసేందుకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది అని ఆంజనేయులు పేర్కొన్నారు. కొన్ని వార్తలు విషయంలో అప్పుడప్పుడు రాజకీయ నాయకులు మరికొన్ని సంఘ వ్యతిరేక శక్తుల నుండి దాడులు ఎదుర్కొన్న సందర్భాలు గతంలో ఉంటే ఇప్పుడు అధికారుల నుండే జర్నలిస్టుల పై దాడులు జరుగుతున్నాయి, కేసులు పెడుతున్నారు, నోటీసులు ఇస్తున్నారు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు నెలకు రూ. 3 వేల చొప్పున మూడు సంవత్సరాల పాటు పరిహారం అందించే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కనీసం ఒక్క వృద్ధాశ్రమాన్ని జర్నలిస్టుల కోసం కేటాయించాలని ఆంజనేయులు అభ్యర్థించారు.

దేశంలో 18 రాష్ట్రాల్లో పెన్షన్ ఇస్తున్నారు. రాష్ట్రంలో మొత్తం వెయ్యి.. 1200 మించి రిటైర్డ్ జర్నలిస్ట్స్ ఉండరు. నెలకు కొంత మొత్తం పెన్షన్ గా ఇస్తే అదో సామాజిక భద్రతగా ఉంటుంది. మన రాష్ట్రంలో కూడా పెన్షన్ అమలు చేయాలని కోరుతున్నామని వెంకటరావు తన అధ్యక్షోపన్యాసంలో పేర్కొన్నారు. చాలాకాలంగా జర్నలిస్టుల సమస్యలు పెండింగ్ లో ఉన్నాయి. అందరి సమస్యలూ జర్నలిస్టులు వెలికితెస్తారు... మరి వారి సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదు అని ఆవేదన వ్యక్తంచేశారు. జర్నలిస్టుల పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. వాటి పరిష్కారం కోసం పలుమార్లు మంత్రికి, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చాం. ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయని పేర్కొన్నారు. తొలుత "ఫెడరేషన్" ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి ఎం.బి.నాథన్ స్వాగతం పలుకుతూ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ప్రధానంగా 14 సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు కలిమిశ్రీ నాయకులను వేదిక పైకి ఆహ్వానించారు. "ఫెడరేషన్", ఏపీ బీజేఏ, ఎన్ఏజే నాయకులు కొండయ్య, అమరయ్య, గంట్ల శ్రీనుబాబు, ఎం. శ్రీనివాసరావు, మంజరి, శాంతిశ్రీ, ఇంకా ఆ సంఘాల జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు వేదికను అలంకరించారు. మంత్రికి ఆయా సమస్యలను వివరిస్తూ అ సంఘాల రాష్ట్ర నాయకులు వినతిపత్రం అందించారు. తొలుత "కళారత్న" నాట్యగురు భాగవతుల సౌమ్య శిష్యులు ప్రదర్శించిన నృత్యాలు ఆహూతుల్ని విశేషంగా అలరించాయి. సౌమ్యను మంత్రి ద్వారా సన్మానించారు. నర్తకీమణులకు సర్టిఫికెట్లు అందించారు. ప్రజానాట్యమండలి గాయకులు అనిల్, కవి, అప్పన్న పాడిన అభ్యుదయ గీతాలు అలరించాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ నుండి పెద్ద సంఖ్యలో "ఛలో విజయవాడ" కార్యక్రమానికి విచ్చేశారు. కొన్ని జిల్లాల నుండి వేకువజామనే నగరానికి చేరుకున్నారు. బస్సులు, రైళ్లు, కార్లు తదితర మార్గాల ద్వారా ర్యాలీకి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 11 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని నిర్వాహకులు ప్రకటించినా పది గంటలకే చేరుకోనారంభించారు. 11:30 గంటల వరకు ఆయా జిల్లాల నుండి జర్నలిస్టులు వస్తూనే ఉన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి.. మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి.. పెన్షన్ సదుపాయం కల్పించాలి.. మీడియా అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలి.. జర్నలిస్టులకు వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలి.. జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలి తదితర నినాదాలతో మహాత్మా గాంధీ రోడ్డు మారుమోగింది. పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినప్పటికీ రద్దీని అదుపుచేయడానికి.. ట్రాఫిక్ ను క్లియర్ చేయడానికి అనివార్యంగా రోప్ పార్టీని ఏర్పాటు చేయాల్సొచ్చింది. ఇంత పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు ర్యాలీ చేయడం ఇటీవల కాలంలో ఇదే పేర్కొనదగినది. ర్యాలీకి సిఐటియు రాష్ట్ర నాయకురాలు ధనలక్ష్మి తదితరులు మద్దతు పలికారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకులతోపాటు ఆయా జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు.. కార్యవర్గాలు.. ఇతర సభ్యులు.. మహిళలు సహా పెద్ద సంఖ్యలో పాల్గొనడం నగర ప్రజానీకాన్ని అబ్బురపరిచింది.




# నక్కపల్లి నూకాలమ్మ ఆలయ ఉత్సవ కమిటీ ఏర్పాటు



**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 04:** మండల కేంద్రం నక్కపల్లి నూకాలమ్మ తల్లి ఆలయ ఉత్సవ కమిటీ ఏర్పాటు జరిగింది. స్థానిక నూకాలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో బుధవారం పార్టీల కతీతంగా గ్రామస్తులందరూ ఏకమై నూతన ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. కొత్త అమావాస్య వేడుకలను పురస్కరించుకొని ఏర్పాటు అయిన ఈ కమిటీలో అధ్యక్షులుగా వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, కార్యదర్శిగా పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ లను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా మీగడ సత్యనారాయణమూర్తి, కోసూరి శ్రీనివాసరావు, అల్లాడ కొండబాబు, కొల్నాటి దుర్గాప్రసాద్, పెదిరెడ్డి రమేష్, వీసం నానాజీ, దేవరపు లోవరాజు, అడ్డూరి నాగభూషణం, కోల్నాటి తాతాజీ, దేశెట్టి కృష్ణ, దేవరపు వెంకట సత్య నారాయణ, పోలనాటి నానాజీ, కర్రి శివ, అల్లాడ తాతారావు, మోటూరి ఈశ్వరరావు, ముద్దా శ్రీనివాసరావు, కోలనాటి నానాజీ, సకురు దుర్గ, బొక్స్ రాము నియమితులయ్యారు. మేనేజ్మెంట్ కమిటీ వీసం రాజు, కర్రి వెంకట సత్యనారాయణ (కె వి )లను ఏర్పాటు చేశారు. గ్రామస్తులందరూ సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేస్తామని తెలిపారు.

# ప్రతి బుధవారం అయ్యప్ప అన్న ప్రసాద వితరణ కార్యక్రమం విజయవంతంగా సాగిపోతుందని ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు

**అనంతగిరి మార్చి 4 పెన్ సత్తా, మార్చ్ 04:** :అనంతగిరి మండల కేంద్రంలో తెలంగాణా శబరిమల అనంతగిరి గా పేరుగాంచిన శ్రీ అయ్యప్ప సన్నిధిలో 2026 సంక్రాంతి పండగ నుండి ప్రారంభం అయినది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి బుధవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం అయ్యప్ప సన్నిధానంలో ఎనిమిదవ వారం కోదాడ వాస్తవ్యులు మల్లెల బ్రహ్మయ్య - రాణి దాతలుగా వ్యవహారించినా

రు.. ఇట్టి కార్యక్రమం లో సుమారుగా 50 మంది భక్తులు పాల్గొని, స్వామి నీ దర్శించి, అన్నప్రసాదం స్వీకరించినారు. ఈ కార్యక్రమం లో ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు,పందిరి వీరయ్య, చలిగంటి లక్ష్మణ్ రావు, మహాలక్ష్మయ్య బండారుపల్లి వెంకటేశ్వర్ రావు, ఐతనబోయిన వెంకటేశ్వర్లు, పాలిక నరసింహారావు, కొండపల్లి కిషనరావు తదితరులు పాల్గొన్నారు.



# తల్లాడ మండలంలో పలు శుభకార్యాలకు హాజరైన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్



**పెన్ సత్తా, మార్చ్ 04:**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ బుధవారం తల్లాడ లో పర్యటించారు పర్యటనలో భాగంగా పలు శు భకార్యాలకు హాజరైనారు. తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో మారెళ్ళ మల్లికార్జున లక్ష్మి దంపతుల కుమార్తె నూతన వధువు యామిని ని ఆశీర్వదించారు ఈ సందర్భంగా నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని దీవించారు. బాలపేట గ్రామంలో పాలపు నాగయ్య కళావతి దంపతుల కుమారుడు నూతన వరుడు ఉదయ్ ను ఆశీర్వదించారు. తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామానికి చెందిన దీవెల వెంకటేశ్వరరావు ఝాన్సీ దంపతుల కుమారుడు నూతన వరుడు గోపీచంద్ ను అక్షింతలు వేసి దీవించారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశీర్వదించారు . ఈ వివాహ శుభకార్యాలకు దయానంద్ విజయకుమార్ హాజరు కావడంతో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో అన్నారుగూడెం కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిల్లుపాడు బలపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తల్లాడ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలో పాల్గొన్న డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి.



**వలిగొండ మండలం పెన్ సత్తా, మార్చ్ 04:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఉన్న వేముల కొండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏర్పుల యాదయ్య కుమార్తె ఐశ్వర్య మనవరాలు ఝాన్సీ మనవడు పండు మృతి చెందడం జరిగింది.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి మరియు సామరామిరెడ్డి పులిపలుపుల రాములు గౌడ్ రసూల్ గ్రామ సర్పంచ్ ఏర్పుల వెంకటేశం కాడిగళ్ళ లింగయ్య మరియు కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు అంతక్రియలలో పాల్గొన్నారు.ం

## లైన్మెన్ దినోత్సవం ఘనంగా నిర్వహణ చింతకాని, నాగులవంచ సెక్షన్‌లలో విద్యుత్ సిబ్బందికి సత్కారం...



**చింతకాని పెన్ సత్తా, మార్చ్ 04:** .లైన్మెన్ దినోత్సవం సందర్భంగా చింతకాని మరియు నాగులవంచ విద్యుత్ సెక్షన్‌లలో ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. సెక్షన్ తరపున నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యుత్ సరఫరా నిర్వహణలో విశేష సేవలు అందిస్తున్న లైన్మెన్లు, సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్రమాదాల నివారణపై ఉద్యోగులు మరియు వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ తీగలు తెగిపడినప్పుడు దగ్గరికి వెళ్లకూడదని, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద జాగ్రత్తలు పాటించాలని, ప్రమాదాలు జరిగిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని

సూచించారు.కార్యక్రమంలో ఏఈ ఎలక్ట్రికల్ శ్రీధర్, చింతకాని మరియు నాగులవంచ ఎస్ఎల్ఐ యస్ వెంకటేశ్వరరావు, ఎల్ఐలు రాంబాబు, సూర్యమోహన్, శ్రీనివాసరావు, ఎల్ఎం శ్రీనివాసచారి, ఏఎల్ఎంలు లువేణు, వీరన్న, కిషోర్ తదితర విద్యుత్ సిబ్బంది

పాల్గొన్నారు.ఎండ, వర్షం, రాత్రి పగలు తేడా లేకుండా ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్న లైన్మెన్ల సేవలను అధికారులు ప్రశంసించారు.

# నేడు 5 .3 2037 గురువారం నాగలవంచ రైతు వేదిక నందు మొక్కజొన్న రైతులు సమావేశం.

**చింతకాని పెన్ సత్తా, మార్చ్ 04:**
**ప్రతినిధి.**మొక్కజొన్న రైతు సోదరులకు మనవి
.మన మొక్కజొన్న రైతుల సమస్యలను మాట్లాడుకొనటానికి నాగులంచ రైతు వేదిక నందు గురువారం 5 3 2026 నా ఉదయం 10 గంటలకు నాగులవంచ సీతంపేట చిన్న మండవ తిమ్మినేనిపాలెం తిరుమలాపురం జగన్నాధపురం రేపల్లెవాడ పాతర్లపాడు నాగులంచ రైల్వే కాలనీ రైతులు కలుసుకుందాం
భవిష్యత్ కర్తవ్యాలను కార్యాచరణనుప్రకటిస్తామని నిర్ణయించుకుందాం
ప్రస్తుతం మొక్కజొన్న ధర బహిరంగ మార్కెట్లో 1800 వందలు వరకు నడుస్తుంది రేపు మన మొక్కజొన్నలు కల్లాల్లోకి వచ్చేసరికి 15 1600 వందలకు చేరుకుంటుంది అనే భయం రైతుల్లో ఏర్పడింది
ప్రభుత్వ మద్దతు ధర 2400 ఉన్నది
మార్కెఫెడ్ ఏర్పాటు చేసి ప్రభుత్వం కొనుగోలు చేయాలి
మనం మార్కెఫెడ్ ఏర్పాటు చేయమని మొక్కజొన్నలు కళాల్లోకి వచ్చినప్పుడు అడిగితే గవర్నమెంట్ ఏర్పాటు చేసేసరికి నెల రోజులకు పైగా పడుతుంది మనం మొక్కజొన్నలను నెలరోజులు కల్లాల్లో నిలువ ఉంచుకోలేము వర్షాల భయం వెన్నాడుతుంది
మనం అందరం మార్కెఫెడ్ ఏర్పాటు చేయాలని ఇప్పుడే ప్రభుత్వాన్ని అడగవలసి ఉన్నది
కావున ఈ సమావేశం ఏర్పాటు చేస్తున్నాం
ఈ సమావేశం లో ప్రస్తుతం గాలి వానకి పడిపోయిన మొక్కజొన్న రైతుల సమస్యలు కూడా మాట్లాడుదాం
ఈ సమావేశం రాజకీయాలకు అతీతమైనది
కేవలం మొక్కజొన్న రైతుల కోసమే ఏర్పాటు చేసుకుంటున్నాం
కావున రైతు సోదరులు మీ మీ గ్రామ గ్రూపుల్లో ఈ మెసేజ్ ని ఫార్వర్డ్ చేసి రైతులందరికీ సమాచారం ఇవ్వగలరు
ఇంకా ఏదైనా సమాచారం కావాలనుకుంటే రైతులు ఈ నెంబర్కు కాల్ చేయగలరు ఫోన్ నెంబర్ 9441911135

# తల్లాడ విద్యుత్ శాఖ సిబ్బందికి ఘనంగా సన్మానం

**పెన్ సత్తా, మార్చ్ 04:**:బుధవారం లైన్మెన్ దివస్ సందర్భంగా తల్లాడ సెక్షన్లలో పని చేస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బంది అయిన ఫోర్‌మన్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మన్, అసిస్టెంట్ లైన్‌మన్, అన్‌మ్యాన్డ్ సిబ్బంది, స్పాట్ బిల్లర్స్ మరియు సబ్‌స్టేషన్ ఆపరేటర్లను ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలను అందజేసారు .
ఈ సందర్భంగా లైన్మెన్‌ల ప్రాముఖ్యత, విద్యుత్ శాఖలో వారు అందిస్తున్న సేవలు మరియు పని సమయంలో తీసుకోవలసిన భద్రతా జాగ్రత్తల గురించి వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ ఏడిఈ ఎన్ సతీష్ , తల్లాడ ఏఈ రాయల ప్రసాద్, సబ్ -ఇంజనీర్స్ మరియు



సిబ్బంది పాల్గొన్నారు.

## - కాంగ్రెస్ పార్టీ నుండి మాదిగలకు రాజ్యసభ స్థానం కేటాయించాలని డిమాండ్:




**- నల్ల చంద్ర స్వామి మాదిగ**
**ఎంఎస్పి యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు.**
**- తెలంగాణ లో మాదిగల జనాభా శాతం ఎక్కువ అందుకే రాజ్యసభ సీటు కేటాయించాలని కోరుతున్నాం:**
**- దుబ్బ రామకృష్ణ మాదిగ**
**ఎమ్మార్పియస్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు**

**వలిగొండ మండలం పెన్ సత్తా, మార్చ్ 04:**
యాదాద్రి భువనగిరి జిల్లా :
భువనగిరి పట్టణం స్థానిక యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ముందు
వీ౯రూ అధినేత పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారి పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా ఎంఎస్పీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ మరియు ఎమ్మార్పియస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగలు మాట్లాడుతూ...

" కాంగ్రెస్ నుండి మాదిగలకు ఒక రాజ్యసభ స్థానాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు అందుకు రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత తీసుకోవాలని కోరారు గతంలో ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం దేశంలోనే మొట్ట మొదలు అమలు చేస్తానని మాట ఇచ్చి నిలబెట్టుకున్నందుకు గౌరవ రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలు కు రాజ్యసభ స్థానాన్ని కేటాయించాలని అందుకు పూర్తి బాధ్యత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి గారు బాధ్యతగా తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద్ గారికి మెమోరాండం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ, ఎమ్మార్పియస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకులు మంద శంకర్ మాదిగ, ఎమ్మార్పియస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికల దేవేందర్ మాదిగ, వివిధ మండలాల నాయకులు రామస్వామి మాదిగ, మైలారం జంగయ్య మాదిగ,కే ఉపేందర్ మాదిగ, బొర్రా నర్సింహ్మా మాదిగ, మైసయ్య మాదిగ, నరేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## కీర్తిశేషులు మంద చంద్రయ్య ముదిరాజ్ దశదినకర్మలో పాల్గొన్న బిజెపి పార్టీ నాయకులు.







**వలిగొండ మండలం పెన్ సత్తా, మార్చ్ 04:**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ఉన్న సంఘము గ్రామంలో బిజెపి పార్టీ జిల్లా నాయకులు మంద నర్సింహ ముదిరాజ్ వారి తండ్రిగారు అనారోగ్యం చేత గత వారం మృతి చెందినవారు. బుధవారం రోజున సంఘం గ్రామంలో స్వగ్రామంలో నాలుగు గంటలకు కీర్తిశేషులు మంద చంద్రయ్య ముదిరాజ్ గారి దశదినకర్మ బంధుమిత్రులు కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొని ఘనంగా నిర్వహించినారు.
ఈ కార్యక్రమానికి బిజెపి పార్టీ మండల నాయకులు బంధారపు రాములు నాగేల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గోపిరాజుపల్లి లో సిసి రోడ్డు ప్రారంభం.




**వలిగొండ మండలం పెన్ సత్తా, మార్చ్ 04:**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలపరిధిలో ఉన్న గోపరాజుపల్లి గ్రామ సర్పంచ్ సలిగంజి పృద్వి ఉప సర్పంచ్ లింగస్వామి పాల్గొని 10 లక్షల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా ఎమ్మెల్యే ఆదేశానుసారం సిసి రోడ్డు గ్రామ సర్పంచి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.
ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు నెంబర్లు గ్రామపంచాయతీ పెద్దలు కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్ అనురాగ్ జయంతిని సన్మానించిన తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మహ్మద్ షానూర్ బాబా



**పెన్ సత్తా, మార్చ్ 04:**నూతనంగా యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన అనురాగ్ జయంతిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా.. వారితోపాటు జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న జిల్లా కార్యదర్శి గుర్రం మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షులు గట్టికొప్పుల శ్రీనివాస్ , కార్యవర్గ సభ్యులు అవిశెట్టి మధు తదితరులు పాల్గొన్నారు

## పలుసం సతీష్ గౌడ్ సౌజన్యంతో ఆర్థిక సహాయం అందజేత.

**వలిగొండ మండలం పెన్ సత్తా, మార్చ్ 04:**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలో.
తుర్కపల్లి గ్రామంలో ఇటీవల మరణించిన పల్లాం స్వామి కుటుంబానికి, పెద్ద మనసుతో ₹10,000 ఆర్థిక సహాయం అందజేసిన పల్లాం సతీష్ గౌడ్ కి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. వారి పిల్లలను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో కూడా వారికి అండగా ఉండాలని
కోరుకుంటున్నాను.



## అలీబాబా క్వెన్ ఎఐ విభాగం అధిపతి రాజీనామా




చైనా టెక్ దిగ్గజం అలీబాబా గ్రూప్ కు చెందిన క్వెన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం అధిపతి లిన్ జున్యాంగ్ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. "బై నా ప్రియమైన క్వెన్," అని ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో సంక్షిప్తంగా పోస్టు చేశారు. అయితే ఆయన కారణాలను వెల్లడించలేదు. ఈ ఏడాది క్వెన్ విభాగాన్ని వీడిన మూడవ సీనియర్ అధికారి లిన్. క్వెన్ పోస్ట్-ట్రైనింగ్ విభాగానికి నాయకత్వం వహించిన యు బోవెన్ కూడా రాజీనామా చేసినట్లు చైనీస్ మీడియా సంస్థ లేట్‌పోస్ట్ తెలిపింది. జనవరిలో కోడింగ్ పరిశోధన శాస్త్రవేత్త హుయ్ బిన్యువాన్ నిష్క్రమించారు. నిష్క్రమణలపై స్పందించేందుకు అలీబాబా అధికారులు స్పందించలేదు. ఇదే సమయంలో హాంకాంగ్ మార్కెట్‌లో అలీబాబా షేర్లు 2.8% తగ్గి ముగిశాయి. మధ్యాహ్న ట్రేడింగ్‌లో 4% వరకు పతనమయ్యాయి. ఇటీవల క్వెన్ నవీకరించిన ఉత్పత్తులను విడుదల చేసిన రెండు రోజులకే ఈ రాజీనామా చోటుచేసుకుంది. క్వెన్ మొబైల్ యాప్ నెలవారీ క్రియాశీల వినియోగదారులు జనవరిలో 31.05 మిలియన్ల నుంచి ఫిబ్రవరిలో 203 మిలియన్లకు పెరిగినట్లు ఎఐసిపిబి వెల్లడించింది. ప్రస్తుతం ఇది ఓపెన్ ఎఐ యొక్క 'చాట్ బాట్' మరియు బైట్ డాన్స్ డౌబావో యాప్ తర్వాత ప్రపంచవ్యాప్తంగా మూడవ స్థానంలో ఉంది. 2023 నుంచి అలీబాబా 400కు పైగా ఓపెన్ సోర్స్ 'క్వెన్' మోడళ్లను విడుదల చేసింది. ఈ మోడళ్లు ఇప్పటివరకు ఒక బిలియన్ సార్లు డౌన్‌లోడ్ చేయబడ్డాయని సంస్థ పేర్కొంది.

## చాట్‌జిపిటికి పెంటాగన్‌తో ఒప్పందం దెబ్బ




అమెరికా రక్షణ శాఖ (పెంటాగన్)తో ఓపెన్ ఎఐ కుదుర్చుకున్న వివాదాస్పద ఒప్పందంపై యూజర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రత్యర్థి సంస్థ ఆంత్రోపిక్ తమ ఎఐ సాంకేతికతను సామూహిక నిఘాకు లేదా అటానమస్ ఆయుధాలకు ఉపయోగించకూడదని నిబంధన విధించడంతో పెంటాగన్ ఆ సంస్థను పక్కన పెట్టింది. ఆ వెంటనే చాట్‌జిపిటి మాతృసంస్థ ఓపెన్ ఎఐ రంగంలోకి దిగి ఈ ఒప్పందాన్ని సొంతం చేసుకోవడంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని ఫలితంగా అమెరికాలో చాట్‌జిపిటి యాప్ తొలగింపులు (అన్‌ఇన్‌స్టాల్) ఒక్కసారిగా 295 శాతం పెరగగా, వన్‌స్టార్ రేటింగ్‌లు 775 శాతం పెరిగాయి. ఎఐ సాంకేతికతను అమెరికన్లపై నిఘా పెట్టడానికి, యుద్ధాల్లో ఉపయోగించడానికి ఒపెన్ ఎఐ అంగీకరించడంతో నిరసన వ్యక్తం అవుతోంది. రక్షణ ఒప్పందాలకు దూరంగా ఉంటామని ప్రకటించిన ప్రత్యర్థి సంస్థ ఆంత్రోపిక్‌కి చెందిన క్లాడ్ యాప్ డౌన్‌లోడ్లు 88 శాతం పెరిగి, అమెరికా యాప్ స్టోర్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకుంది. ఈ వివాదంపై ఓపెన్ ఎఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మాన్ స్పందిస్తూ.. పెంటాగన్ ఒప్పందం జరిగిన తీరు అస్తవ్యస్తంగా ఉందని అంగీకరించారు. ఆంత్రోపిక్‌తో పెంటాగన్‌కు విభేదాలు వచ్చిన వెంటనే ఈ ఒప్పందం చేసుకోవడం వల్ల యూజర్లకు తప్పుడు సంకేతాలు వెళ్లాయన్నారు. తమ ఎఐ సాంకేతికతను అమెరికన్లపై నిఘా పెట్టడానికి లేదా అటానమస్ ఆయుధాల తయారీకి ఉపయోగించకూడదనే నిబంధనలను స్పష్టం చేసినాకే తాము రక్షణ శాఖతో కలిసి పనిచేస్తున్నామని ఆయన వివరించారు.

## ఫిబ్రవరిలో రూ.1.83 లక్షల కోట్లకు చేరిన స్థూల జీఎస్టీ వసూళ్లు




జీఎస్టీ వసూళ్లు ఫిబ్రవరి నెలలో భారీగా నమోదయ్యాయి. 2026 ఫిబ్రవరి నెలకు గాను రూ.1.83 లక్షల కోట్ల స్థూల జీఎస్టీ వసూలైనట్లు కేంద్రం ఆదివారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు నెలతో పోలిస్తే ఇది 8.1 శాతం అధికం కావడం విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఫిబ్రవరి 28 నాటికి మొత్తం స్థూల జీఎస్టీ ఆదాయం రూ.20.27 లక్షల కోట్లకు చేరింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఇది 8.3 శాతం వృద్ధిని సూచిస్తోంది. ఇక ఫిబ్రవరిలో రూ.22,595 కోట్ల రీఫండ్లు చెల్లించారు. రీఫండ్లు సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్టీ ఆదాయం రూ.1.61 లక్షల కోట్లుగా నమోదైంది. దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 5.3 శాతం వృద్ధితో రూ.1.36 లక్షల కోట్లుగా ఉండగా.. దిగుమతుల ద్వారా వచ్చిన రాబడిలో మాత్రం 17.2 శాతం భారీ వృద్ధి కనిపించింది. దిగుమతుల ద్వారా రూ.47,837 కోట్లు సమకూరాయి. అయితే, సెస్ వసూళ్లు మాత్రం ఆందోళనకరంగా తగ్గాయి. గతేడాది ఫిబ్రవరిలో రూ.13,481 కోట్లుగా ఉన్న నికర సెస్. ఈసారి రూ.5,063 కోట్లకు పడిపోయింది. రాష్ట్రాల వారీగా చూస్తే మిశ్రమ ఫలితాలు కనిపించాయి. పారిశ్రామిక రాష్ట్రాల్లో వృద్ధి నమోదు కాగా, వనరుల ఆధారిత రాష్ట్రాల్లో వసూళ్లు తగ్గాయి. మహారాష్ట్ర రూ.10,286 కోట్ల వసూళ్లతో దేశంలోనే అగ్రస్థానంలో నిలవగా.. కర్ణాటక, గుజరాత్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాల్లో సానుకూల వృద్ధి నమోదు కాగా.. పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ఆదాయం తగ్గింది. జీఎస్టీ 2.0 తర్వాత వసూళ్లు స్థిరంగా పెరుగుతున్నాయని, ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ బలంగా ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దిగుమతుల రాబడి పెరగడం అంతర్జాతీయ వాణిజ్య కార్యకలాపాల జోరును సూచిస్తోందని పేర్కొన్నారు.

# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు



పశ్చిమాసియాలో బాంబుల వర్షం కురుస్తోంది. మరోవైపు ప్రపంచ ఇంధన సరఫరాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిని ఏ నౌక దాటాలని చూసినా నిప్పుపెడతామని ఇరాన్ చేసిన హెచ్చరికలతో చమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ అంతర్జాతీయ పరిణామాలు రానున్న రోజుల్లో దేశీయంగా ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలియని అనిశ్చితి మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. దీంతో బుధవారం దేశీయ మార్కెట్లు భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో సెన్సెక్స్ 1,700 పాయింట్ల మేర క్షీణించింది. నిఫ్టీ 24,400 దిగువన కదలాడుతోంది. ఉదయం 9.30 గంటల సమయంలో సెన్సెక్స్ 1,670 పాయింట్ల మేర పతనమై 78,565 వద్ద ఉంది. నిఫ్టీ 513 పాయింట్లు కోల్పోయి 24,351 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ సూచీలో ఇన్ఫోసిస్, కోల్ ఇండియా, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టీసీఎస్, ఓఎన్‌జీసీ షేర్లు లాభాల్లో ఉండగా.. లార్సెన్, టాటా స్టీల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, శ్రీరామ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు నష్టాల్లో కదలాడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లు కూడా భారీ నష్టాల్లో ఉన్నాయి. మంగళవారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. నేటి ట్రేడింగ్‌లో ఆసియా మార్కెట్లు కూడా అదే బాటలో ఉన్నాయి. దక్షిణ కొరియా కొస్పి 12 శాతం మేర పడిపోయింది. దాంతో ట్రేడింగ్‌ను నిలిపివేయాల్సిన పరిస్థితి తలెత్తింది. కాగా.. భారత్ చమురు అవసరాల్లో 85 శాతం దిగుమతుల వల్లే తీరుతున్నాయి. ఇప్పటికే పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలై ఐదు రోజులు అవుతుండగా.. ఇంకా ఎన్ని రోజులు కొనసాగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. యుద్ధం తీవ్రమవుతుండటంతో ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి. ఇవన్నీ మదుపర్లను అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి. భారత్‌లో ద్రవ్యోల్బణం, ఆర్థికవృద్ధిపై ఈ ప్రభావం గురించి ఆందోళనలు నెలకొన్నాయి. యుద్ధం ముదురుతూ ఉంటే.. వాణిజ్యలోటు పెరుగుతుందని, రూపాయి బలహీనపడుతుందని, కార్పొరేట్ ఆదాయాలపై ఒత్తిడి ఉంటుందని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్‌లో చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్స్ స్ట్రాటజిస్ట్ వీకే విజయ్ కుమార్ అంచనా వేశారు. ట్రేడింగ్ ప్రారంభంలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీలో లార్సెన్ అండ్ టర్బో స్టాక్ 7 శాతం మేర కుంగింది. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ 3.5 శాతం క్షీణించింది. వార్ ఎఫెక్ట్‌తో అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి క్షీణించి, జీవనకాల కనిష్ఠాలకు పడిపోయింది. నేటి సెషన్‌లో 69 పైసలు కోల్పోయి, ఏకంగా 92.18 మార్క్‌ను తాకింది.

# 2 రోజులుగా పతనం.. మళ్లీ తగ్గిన బంగారం ధర



పసిడి ప్రియులకు అదిరే శుభవార్త. అమెరికా- ఇరాన్ యుద్ధం వేళ బంగారం ధరలు భారీగా పెరుగుతాయన్న అంచనాలను తలకిందులు చేస్తూ దేశీయ మార్కెట్ల పసిడి ధరలు వరుసగా రెండో రోజూ తగ్గాయి. గల్ఫ్ దేశాలపైన ఇరాన్ మిసైల్స్ దాడి చేస్తోంది. అమెరికా భీకర దాడులు ఉంటాయని ప్రకటించింది. దీంతో సురక్షితమైన పెట్టుబడి మార్గంగా బంగారాన్ని ఎంచుకుంటారు. గత రెండు రోజుల వరకు ఇదే జరిగినా ఇప్పుడు చాలా మంది ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్స్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆల్ టైమ్ హై స్థాయి నుంచి బంగారం ధరలు పతనమవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు 5400 డాలర్ల గరిష్టాన్ని తాకి ఆ తర్వాత వెనక్కి తగ్గుతోంది. ఇక హైదరాబాద్ మార్కెట్లో పసిడి ధరలు ఈ రెండు రోజుల్లోనే తులంపై ఏకంగా రూ.3000 వరకు తగ్గాయి. దేశీయ మార్కెట్లో 22 క్యారెట్లబంగారం రేటు క్రితం రోజు తులంపై రూ.2350 మేర తగ్గిన సంగతి తెలిసిందే. అదే ట్రెండ్ కొనసాగిస్తూ ఈరోజు మరో రూ.450 మేర తగ్గింది. దీంతో రెండు రోజుల్లోనే తులం రేటు రూ.2800 వరకు తగ్గింది. ఇక 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ.3170 మేర తగ్గింది.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రం స్పష్టత




పశ్చిమాసియా దేశాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. భారత్ లో చమురు నిల్వలపై ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఈ యుద్ధం సుమారు నెలరోజులపాటు కొనసాగవచ్చని చెప్పడంతో.. చమురు నిల్వలపై ఆందోళన మరింత పెరిగింది. ఈ క్రమంలో ప్రస్తుతం ఉన్న పెట్రోల్, డీజిల్ నిల్వలు అయిపోతే ధరలు గణనీయంగా పెరుగుతాయన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్న వేళ.. ధరల పెంపుపై కేంద్రప్రభుత్వ వర్గాలు క్లారిటీ ఇచ్చాయి. చమురు, గ్యాస్ నిల్వలపై కీలక ప్రకటన చేశాయి. పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే పెంచే ఆలోచన లేదని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశంలో చమురు నిల్వలు 45 రోజులకు సరిపడా ఉన్నాయని, చమురు దిగుమతి కోసం ప్రత్యామ్నాయాలు చూస్తున్నామని కేంద్రవర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ఎల్ఎన్ జీ, ఎల్ పీజీ దిగుమతుల కోసం ప్రత్యామ్నాయాలు చూస్తున్నట్లు వెల్లడించాయి. ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న యుద్ధం నేపథ్యంలో హార్మూజ్ జలసంధి మూతపడిన విషయం తెలిసిందే. దీంతో వేలాది చమురు షిప్పులు సముద్రంలోనే నిలిచిపోయాయి. హార్మూజ్ జలసంధి సమీపంలో వేలాది చమురు నౌకలు ట్రాఫిక్ జామ్ లో చిక్కుకున్నాయి. ఇవన్నీ ఎగుమతి కావాలంటే యుద్ధం ఆగాలి. అందుకు కనీసం 40 రోజులు సమయం పడుతుందని అంచనా. అక్కడి నుంచి చమురు రాకపోతే మనదగ్గరి నిల్వలు అయిపోతే ధరలు పెరుగుతాయన్న ఆందోళనతో వాహనదారులు పెట్రోల్ బంకులకు క్యూ కడుతున్నారు. మిడిల్ ఈస్ట్ కంట్రీస్ లో నెలకొన్ని ఉద్రిక్తతల నేపథ్యంలో మనవద్ద పెట్రోల్ ధరలు పెరుగుతాయన్న వార్తల నేపథ్యంలో వాహనదారులు పెట్రోల్ బంకులకు క్యూ కట్టారు. హైదరాబాద్ లో వాహనదారులు వాహనాల్లోనే కాక.. బాటిల్స్ లోనూ పెట్రోల్ ఫిల్ చేయించుకుంటున్న దృశ్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## మయామిలో ఎస్టేట్ కొన్న జూకర్‌బర్గ్.. లగ్జరీ ప్రాపర్టీ విలువ రూ.14 వందల కోట్లు!



అమెరికా టెక్ దిగ్గజం మెటా ప్లాట్‌ఫామ్స్ అధినేత మార్క్ జూకర్‌బర్గ్ రియల్ ఎస్టేట్ ప్రపంచంలో మరో సంచలనం సృష్టించారు. తన భార్య ప్రిసిల్లా చాన్‌తో కలిసి మయామిలోని అత్యంత విలాసవంతమైన ఇండియన్ క్రీక్ ఐలాండ్ లో ఒక భారీ వాటర్‌ఫ్రంట్ మాన్షన్‌ను కొన్నారు. వాల్ స్ట్రీట్ జర్నల్ రిపోర్ట్స్ ప్రకారం దీని విలువ ఏకంగా 170 మిలియన్ డాలర్లు. అంటే మన భారతీయ కరెన్సీ లెక్కల ప్రకారం చూస్తే, దీని విలువ దాదాపు రూ.1,418 కోట్లకు పైమాటే. మయామి-డేడ్ కౌంటీ చరిత్రలోనే ఇది అత్యంత ఖరీదైన రియల్టీ లావాదేవీగా సరికొత్త రికార్డును సృష్టించింది. దీనికి ముందు 2025లో నమోదైన 120 మిలియన్ డాలర్ల ప్రాపర్టీ సేల్ రికార్డును జూకర్‌బర్గ్ ఈ కొనుగోలుతో చెరిపివేశారు. ప్రముఖ సెలబ్రిటీ ప్లాస్టిక్ సర్జన్ ఆరోన్ రోలిన్స్, అతని భార్య మెరైన్ రోలిన్స్ నుంచి జూకర్‌బర్గ్ ఈ ఇంటిని కొనుగోలు చేశారు. బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం దాదాపు రూ.19.2 లక్షల కోట్ల సంపద కలిగిన జూకర్‌బర్గ్, గత కొన్ని వారాలుగా ఈ ప్రాంతంలో తనకు నచ్చిన ఆస్తి కోసం అన్వేషిస్తున్నారు. మార్చి 2వ తేదీన ఈ భారీ డీల్ అధికారికంగా ముగిసింది. కాలిఫోర్నియాలో ప్రతిపాదిత బిలియనీర్స్ ట్యాక్స్ పై చర్చ జరుగుతున్న వేళ.. సిలికాన్ వ్యాలీకి చెందిన దిగ్గజాలు సౌత్ ఫ్లోరిడా వైపుకు వెళ్లటం ఆసక్తికరంగా మారింది. ఈ ఇండియన్ క్రీక్ ఐలాండ్‌ను "బిలియనీర్ బంకర్" అని కూడా పిలుస్తారు. ఎందుకంటే ఇక్కడ నివసిస్తున్న వారందరూ ప్రపంచ స్థాయి ప్రముఖులే. జూకర్‌బర్గ్‌కు పొరుగున ఇవాంకా ట్రంప్, జారెడ్ కుష్నర్ వంటి రాజకీయ, వ్యాపార దిగ్గజాలు ఉండబోతున్నారు. ఇప్పటికే ఆల్ఫాబెట్ కో-ఫౌండర్ లారీ పేజ్ మయామి ప్రాంతంలో రూ.1,568 కోట్లు వెచ్చించి మూడు ప్రాపర్టీలను కొన్న సంగతి తెలిసిందే. అలాగే సెర్గీ బ్రిన్ కూడా రూ.417 కోట్ల విలువైన నివాసాన్ని సొంతం చేసుకునే పనిలో ఉన్నారు. టెక్ ప్రపంచంలోని దిగ్గజాలు వరుసగా మయామికి క్యూ కడుతుండటం అక్కడి రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు మరింత జోష్ నింపుతోంది. మార్క్ జూకర్‌బర్గ్‌కు ఇప్పటికే అమెరికా అంతటా అనేక ఖరీదైన ఆస్తులు ఉన్నాయి. కాలిఫోర్నియాలోని పాలో ఆల్టో, లేక్ తాహోతో పాటు వాషింగ్టన్ డీసీ, హవాయిలోని కవాయ్ ద్వీపంలో ఆయనకు భారీ ఎస్టేట్లు ఉన్నాయి. తాజాగా కొనుగోలు చేసిన ఈ మయామి ఇల్లు ఆయన లగ్జరీ పోర్ట్‌ఫోలియోలో ఒకటిగా నిలిచింది. కేవలం నివాసం కోసమే కాకుండా.. పన్ను ప్రయోజనాలు, భద్రత దృష్ట్యా కూడా బిలియనీర్లు ఇలాంటి ప్రాంతాలను ఎంచుకుంటున్నట్లు విశ్లేషకులు అంటున్నారు. రూ.1,400 కోట్లకు పైగా విలువైన ఈ ఇల్లు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

RNI:APTEL/2023/87729 పెన్ సత్తా PEN SATTA Telugu Daily

# ఎడిటోరియల్

## సమగ్ర విద్యతోనే సమసమాజం

విద్య అనేది మనిషి జీవితాన్ని మార్చే జ్ఞాన ప్రక్రియ. అది కేవలం పాఠశాలల్లో, కళాశాలలో పుస్తకాలు చదవడం మాత్రమే కాదు, మనస్సును, ఆలోచనలను, ప్రవర్తనను, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే అతి పెద్ద జీవన పద్ధతి. విద్య అనేది మనిషిని లోపల నుంచి మార్చే మహోన్నత మార్గం. నైపుణ్యంతో ముందుకు నడిపిస్తుంది, నీతి విలువలతో సరైన మార్గం చూపిస్తుంది. నవచైతన్యంతో ప్రపంచాన్ని మార్చే ధైర్యం ఇస్తుంది. ఈ మూడు లక్షణాలు కలిసినప్పుడే వ్యక్తి సంపూర్ణంగా ఎదుగుతాడు. సమాజం అభివృద్ధి చెందుతుంది. దేశం ముందుకు సాగుతుంది. విద్య అనేది వ్యక్తి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనం. ఇది కేవలం పుస్తకాల జ్ఞానం లేదా పరీక్షల మార్కుల వరకే పరిమితం కాదు. నిజమైన విద్య అంటే మనిషి ఆలోచనా విధానాన్ని మార్చేశక్తి, జీవితాన్ని సార్థకం చేసే మార్గదర్శకం. నేటి వేగవంతమైన ప్రపంచంలో నైపుణ్యాలు, నీతి, నవచైతన్యం వంటి మూడు ముఖ్యాంశాలు ప్రతి ఒక్కరికీ అత్యంత అవసరమైనవి. ఇవన్నీ కలిగినప్పుడు మాత్రమే వ్యక్తి సంపూర్ణ వికాసం సాధ్యమవుతుంది. ఈ పరిపూర్ణతను అందించే మార్గమే సమగ్ర విద్య. కానీ పుస్తకాల్ని కంఠస్థం చేసే విద్యతో ఉద్యోగాలు కూడా రాకపోవడం, ఆత్మవిశ్వాసం తగ్గిపోవడం వంటి సమస్యలు ఏర్పడ్డాయి. కాబట్టే విద్యా వ్యవస్థ నైపుణ్యాల పెంపువైపు మళ్లాలి. పాఠశాల స్థాయినుండే ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, ప్రయోగాలు, ప్రాక్టికల్ శిక్షణ, డిజిటల్ లిటరసీ వంటి అంశాలను బలపరచాలి. నైపుణ్యం ఉన్న విద్యార్థి ప్రపంచంలో ఎక్కడైనా అవకాశాలను సృష్టించగలడు. నీతి వ్యక్తిత్వ వికాసానికి నిత్యావసరం, నైపుణ్యాలు ఉన్నప్పటికీ విలువలు లేకపోతే వ్యక్తి సమాజానికి హానికరుడు అయిపోతాడు. నీతి అనే విలువ మనిషిని లోపలినుంచి మార్చుతుంది. నిజాయితీ, దేశభక్తి, బాధ్యతా భారతం, పరస్పర గౌరవం, కరుణ, సేవాభావం ఇవన్నీ నీతి ద్వారా వచ్చే అంశాలు. ప్రస్తుత కాలంలో విలువలు తగ్గిపోతున్నాయని మనం ప్రతిరోజూ చూస్తున్నాం. సాంకేతికత పెరుగుతున్న కొద్దీ మానవత్వం తగ్గిపోకుండా చూసుకోవడం కూడా విద్యా వ్యవస్థ బాధ్యతే. విలువల పాఠాలు, కథలు, సమాజ సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, గురుశిష్య సంబంధాలపట్ల గౌరవం ఇవన్నీ విద్యార్థుల్లో నీతిని పెంపొందించగల అంశాలు. మంచి విలువలతో ఉన్న విద్యార్థి భవిష్యత్తులో మంచి పౌరుడిగా మారతాడు. నవ చైతన్యం అభివృద్ధికి కొత్త దారి, భవిష్యత్తు నవ చైతన్యాన్ని కోరుతోంది. కొత్త ఆలోచనలు, కొత్త ప్రయోగాలు, కొత్త పరిష్కారాలే ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనను ప్రోత్సహించడం అనేది సమగ్ర విద్యలో కీలక అంశం. కేవలం పాఠాలు నేర్పించడంసరిపోదు. ఆ పాఠాలపై సందేహాలు అడగడం, కొత్త ప్రయోగాలు చేయడం, వైఫల్యం భయపడకుండా ముందుకుసాగడం వంటి ధైర్యం విద్యార్థికి ఉండాలి. ల్యాబ్‌లు, ఇన్నోవేషన్ క్లబ్‌లు, సైన్స్ ఫెయిర్‌లు, స్టార్టప్ ఆలోచనలకు ప్రోత్సాహం ఇవన్నీ నవచైతన్యాన్ని పెంపొందించే మార్గాలు. నవ చైతన్యంతో ఉన్న విద్యార్థి ఉద్యోగం కోసం వెతకడు, ఉద్యోగాలను సృష్టించే సామర్థ్యం కలిగి ఉంటాడు. సాంకేతిక రంగం నుంచి వ్యవసాయం వరకు ప్రతిచోటా ఈ సృజనాత్మక ఆలోచనకు అవసరం పెరిగింది. సమగ్ర విద్య అనేది విద్యార్థిని ఒకే కోణంలో కాకుండా పలు కోణాలలో ఎదగనిచ్చే ప్రక్రియ. అందులో విద్యా జ్ఞానం, సృజనాత్మకత, నైతికత, సామాజిక బాధ్యత, శారీరక ఆరోగ్యం, భావోద్వేగ పరిపక్వత అన్నీ సమపాళ్లలో ఉండాలి. పుస్తకాల జ్ఞానంతోపాటు జీవితానికి అవసరమైన విలువలను నేర్పడం, నైపుణ్యాలను పెంపొందించడం, సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించే ఆలోచనను పోషించడం ఇవన్నీ సమగ్ర విద్య లక్ష్యాలు. సమగ్ర విద్య ఎందుకు అవసరం అంటే సమాజంలో మార్పులు వేగంగా జరుగుతున్న ఈ యుగంలో సమగ్ర విద్య అనేది చాలా కీలకం. ఎందుకంటే ఇది వ్యక్తిని జ్ఞానం కలిగినవాడిగా, నైపుణ్యం ఉన్నవాడిగా, విలువలు పాటించే పౌరుడిగా, సృజనాత్మక ఆలోచకుడిగా మారుస్తుంది. దేశ అభివృద్ధికి ఇలాంటి పౌరులే అవసరం.

పాఠశాలల నుండి ఉన్నత విద్యా సంస్థల వరకు సమగ్ర విద్యను అమలు చేయడం వల్ల ఆరోగ్యవంతమైన, ఆత్మవిశ్వాసంతో నిండిన, బాధ్యత గల, ఆవిష్కరణాత్మక యువత పెరిగి దేశాన్ని ముందుకు నడిపించగలుగుతుంది. విద్య అనేది వ్యక్తిని మాత్రమే కాకుండా, సమాజాన్ని, దేశాన్ని కూడా మార్చగల మహాశక్తి. నైపుణ్యం, నీతి, నవ చైతన్యం ఈ మూడు అంశాలు ఏ ఒక్కరి జీవితాన్నైనా సార్థకంగా మార్చగలవు. కానీ ఇవన్నీ ఒకే చోట పొందాలంటే సమగ్ర విద్య తప్పనిసరి అవసరం దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థలో మార్పులు వేగం పుంజుకుంటున్నాయి. నూతన యుగ అవసరాలకు అనుగుణంగా పాఠశాలలనుండి ఉన్నత విద్య వరకు సమగ్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ అభ్యాసం వంటి అంశాలు ప్రముఖ స్థానం సంపాదిస్తున్నాయి. విద్యా నిపుణుల అభిప్రాయం ప్రకారం, విద్య అంటే కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, విద్యార్థి వ్యక్తిత్వాన్ని అన్ని కోణాల్లో అభివృద్ధి చేసే సమగ్ర ప్రక్రియ కావాలని సూచిస్తున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాల్లో కూడా ఈ మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. పాఠశాలల్లో కొత్త కార్యక్రమాలు, నైపుణ్య ఆధారిత కోర్సులు, సాంకేతిక పరికరాల వినియోగం పెరగడంతో విద్యార్థుల అభ్యాస పద్ధతుల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, జీవన నైపుణ్యాలు, విలువల విద్య వంటి అంశాలను తరగతులలోకి తీసుకువస్తూ పాఠశాలలు విద్యార్థులను భవిష్యత్తు వైపు తీర్చిదిద్దుతున్నాయి. విద్యా నిపుణులు చెబుతున్నదేమిటంటే, నేటి తరం ఉద్యోగాలకే కాదు, జీవితానికి సిద్ధం అవ్వాలి. మొత్తం మీద విద్యా రంగంలో జరుగుతున్న ఈ మార్పులు సమీప భవిష్యత్తులో దేశ యువతకు మరింత బలమైన భవిష్యత్తును అందించనున్నాయి. విద్యార్థులు నైపుణ్యవంతులుగా, విలువలను పాటించే పౌరులుగా, కొత్త ఆలోచనలతో ముందుకు సాగేందుకు ఈ సంస్కరణలు మేలుచేస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాబట్టి నేటి తరానికి సరైన విద్య అంటే కేవలం పుస్తకాలు కాదు, మంచి విలువలు, జీవిత నైపుణ్యాలు, సృజనాత్మకత, సమస్య పరిష్కరణ, ఆధునిక జ్ఞానం ఇవన్నీ కలగలిపిన బహుముఖ విద్య సమగ్ర విద్యను ప్రతి విద్యా సంస్థలో అమలు చేసినప్పుడే మన దేశం నిజమైన అర్థంలో విజ్ఞానభారతంగా వెలుగొందుతుంది.

# పిల్లలు అతిగా ఫోన్ చూస్తున్నారా?



పిల్లల్లో అధిక మొబైల్ వాడకం వ్యసనంగా మారి, వారి శారీరక, మానసిక ఆరోగ్యం, చదువులు, దినచర్యలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. 'టెక్స్ట్ నెక్', కళ్ల అలసట, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుత కాలంలో చాలా మంది ఫోన్ చేతికి ఆరో వేలిగా మారిపోయింది. పెద్దలతో పాటు చిన్న పిల్లలు కూడా ఫోన్‌ను విపరీతంగా వాడుతున్నారు. ఈ అతి వాడకం పెద్దల కంటే పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. శారీరకంగా మానసికంగా వారిని ఇబ్బందికి గురి చేస్తుంది. మీ పిల్లలు కూడా అతిగా ఫోన్ చూస్తుంటే వారిని వెంటనే ఆ అలవాటు నుంచి దూరం చేయడం ఎలాగో ఇప్పుడు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. పిల్లలో ఫోన్ చూసే అలవాటు క్రమంగా ఒక వ్యసనంగా మారుతుంది. పిల్లల దినచర్య, చదువు, ఆటలు, సామాజిక కార్యకలాపాలపై చెడు ప్రభావాన్ని చూపుతుంది. మొబైల్ ఫోన్‌లను అధికంగా ఉపయోగించడం వల్ల పిల్లల శ్రద్ధ, నిద్ర, మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది. అటువంటి పరిస్థితిలో ఈ అలవాటును ఎలా నియంత్రించాలో, పిల్లలను సమతుల్య, ఆరోగ్యకరమైన దినచర్య వైపు ఎలా ప్రేరేపించాలో అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. మొబైల్ ఫోన్‌లను అధికంగా వాడటం వల్ల శారీరక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. మొబైల్ స్క్రీన్‌పై నిరంతరం వేలాడుతూ ఉండటం వల్ల 'టెక్స్ట్ నెక్' వంటి సమస్యలు వస్తాయి, ఇది మెడ, భుజాలు, వెన్నెముకపై చాలా ఒత్తిడిని కలిగిస్తుంది. మొబైల్ ఫోన్‌ల నుండి వెలువడే నీలి కాంతి కళ్ళను అలసటకు గురి చేస్తుంది, వాటిని పొడిగా చేస్తుంది, దృష్టిని బలహీనపరుస్తుంది. రాత్రి ఆలస్యంగా మొబైల్ ఫోన్‌లను వాడటం వల్ల నిద్రలేమి, అలసట మరియు చిరాకు పెరిగే నిద్ర హార్మోన్ 'మెలటోనిన్' ఉత్పత్తి తగ్గుతుంది. గంటల తరబడి ఒకే చోట కూర్చోవడం వల్ల శారీరక శ్రమ తగ్గుతుంది, ఇది ఊబకాయం మధుమేహం వంటి జీవనశైలి వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. మొబైల్ వ్యసనాన్ని అధిగమించాలంటే తల్లిదండ్రులు ముందుగా తమ పిల్లలతో మాట్లాడటం ఉత్తమ మార్గం అని నిపుణులు అంటున్నారు. మొబైల్ ఫోన్‌లను అధికంగా వాడటం వల్ల వారి ఆరోగ్యం, చదువులు, మానసిక అభివృద్ధిపై చెడు ప్రభావం చూపుతుందని పిల్లలకు వివరించడం అవసరం. సమయ పరిమితులను నిర్ణయించడం, మొబైల్ ఫోన్‌ల కోసం ప్రత్యేక సమయాన్ని నిర్ణయించడం, పిల్లలను ఇతర ఆసక్తికరమైన కార్యకలాపాల వైపు ఆకర్షించడం ఉపయోగకరంగా ఉంటుంది. ఆటలు, విహారయాత్రలు, చదువులు, కుటుంబంతో కలిసి చేసే అభిరుచులు మొబైల్ ఫోన్‌ల నుండి దృష్టి మరల్చడానికి సహాయపడతాయి. పిల్లలు మంచి ఉదాహరణను చూడగలిగేలా తల్లిదండ్రులు కూడా మొబైల్ ఫోన్‌ల వాడకాన్ని పరిమితం చేయాలి. క్రమంగా పిల్లలను కొద్దిసేపు మొబైల్ ఫోన్‌లను ఉపయోగించడం అలవాటు చేసుకోండి.

# వీరికి ద్రాక్ష విషంతో సమానం..



ఉతీజీజూవబ ూతిటవ ఇటటవఞబిబ: ఏదైనా పండు లేదా ఆహారం, రోజూ మితంగా తింటే మంచిది.. అలాంటి దినచర్య అనేక ఆరోగ్య ప్రయోజనాలను చేకూరుస్తుంది.. అయితే.. అవకాశం దొరికినప్పుడల్లా దానిని ఎక్కువగా తింటే, మీరు దానిని అనుభవించాల్సిందే అంటున్నారు ఆరోగ్య నిపుణులు.. ఈ వ్యాధులు, సమస్యలు ఉన్నవారు ద్రాక్షకు దూరంగా ఉండాలని.. లేకపోతే సమస్యలు తప్పవని సూచిస్తున్నారు. ద్రాక్ష అనేది అందరూ ఇష్టపడే పండు.. తీపి, పులుపు కలగలిపి జ్యూసీగా ఈ చిన్న పండులో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. బ్లాక్, గ్రీన్ ద్రాక్షాలు ఏవైనా.. తినడం ఆరోగ్యానికి చాలా మంచిది.. ఇందులో విటమిన్లు, బీటా కెరోటిన్, యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.. ఇది గుండె ఆరోగ్యానికి సహాయపడుతుందని.. అందుకే ప్రతి ఒక్కరూ తినాలని డైటీషియన్లు సూచిస్తున్నారు. సాధారణంగా.. మార్కెట్లో ద్రాక్షను చూసినప్పుడల్లా, ఎంత ఖర్చవుతుందని మనం వెంటనే అడుగుతాము. ద్రాక్షకు అంత ఆహ్లాదకరమైన రుచి ఉంటుంది. ద్రాక్ష ఆరోగ్యానికి ఎంత ప్రయోజనకరంగా ఉంటుందో.. అంతే ప్రమాదకరమైనది కూడా కావచ్చు. ఈ వ్యాధులు సమస్యలతో బాధపడేవారు ద్రాక్ష తినకూడదని పేర్కొంటున్నారు. ద్రాక్షలో అధిక స్థాయిలో చక్కెర ఉంటుంది.. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు హానికరం. అందువల్ల, వారు ద్రాక్షను పెద్ద పరిమాణంలో తినకూడదు. మీరు మధుమేహ వ్యాధిగ్రస్తులు, మీ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించాలనుకుంటే, ద్రాక్షను నివారించడం మంచిది.ద్రాక్షలో కరగని ఫైబర్ ఉంటుంది. వీటిని ఎక్కువగా తినడం వల్ల కడుపు నొప్పి, విరేచనాలు వస్తాయి. వాటిలోని చక్కెర కంటెంట్ విరేచనాలకు కారణమవుతుంది. వాటిలోని ఫైబర్ కడుపులో కరగదు కాబట్టి, జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. మూత్రపిండాల్లో రాళ్లు లేదా మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు ద్రాక్షకు దూరంగా ఉండాలి. నల్ల ద్రాక్ష రసం తాగడం వల్ల శరీరంలో పొటాషియం శాతం పెరుగుతుంది. ఇది మూత్రపిండాల సమస్యలు లేదా హైపర్‌కలేమియా ఉన్నవారికి హానికరం. ద్రాక్షలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి.. కాబట్టి ఎక్కువగా తినడం వల్ల బరువు పెరుగుతుంది. జీర్ణ సమస్యలు ఉన్నవారు, బరువు తగ్గాలనుకునేవారు, మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు ద్రాక్షకు దూరంగా ఉండాలి. మీరు వాటిని తినాలని భావిస్తే, మీరు వైద్యుడి సలహా తీసుకోవచ్చు. వాటిని ఎక్కువగా తినడం కంటే మితంగా తినడం మీ ఆరోగ్యానికి మంచిది.

# జీడిపప్పు ఎక్కువ తింటే ప్రమాదమా?



ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగిన జీడిపప్పును మన ఆహారంలో తరచూ తీసుకుంటూ ఉంటాం. అయితే, జీడిపప్పును ఎక్కువగా తీసుకోవడం పలు సమస్యలకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు జీడిపప్పును ఎక్కువగా తీసుకోకపోవడం మంచిందని అంటున్నారు. జీడిపప్పును మితంగా తీసుకుంటేనే ఆరోగ్యానికి మంచిదంటున్నారు. జీడిపప్పు, బాదం, పిస్తా, కిస్మిస్ లాంటి డ్రైఫ్రూట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు చెబుతుంటారు. డ్రైఫ్రూట్స్ రుచికరంగా ఉండటంతోపాటు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ కారణంగానే వీటి ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ సంపన్నుల నుంచి సామాన్య ప్రజల వరకు వీటిని తమ ఆహారంలో తీసుకుంటున్నారు. అయితే, వీటిని అతిగా తీసుకోవడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు కూడా వచ్చే అవకాశం ఉందంటున్నారు ఆరోగ్య నిపుణులు. జీడిపప్పును చాలా మంది తమ వంటకాల్లో వినియోగిస్తుంటారు. పాయసం తోపాటు వెజ్, నాన్ వెజ్ పులావ్, బిర్యానీ, స్వీట్లు, బిస్కెట్లు, కేకులు, టాపింగ్ ఐస్‌క్రీమ్స్ లాంటి ఆహార పదార్థాల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. కొందరు జీడిపప్పును మాసాల పొడి లేదా కారం లేదా మిరియాల పొడితో నెయ్యిలో వేయించి సేవిస్తారు. ఇలా చాలా రకాలుగా జీడిపప్పును తమ ఆహార పదార్థాల్లో తీసుకుంటూ వాటి ప్రయోజనాన్ని శరీరానికి అందిస్తుంటారు. జీడిపప్పు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుందని వైద్య నిపుణులు చెబుతారు. అంతేగాక, శరీర జీవక్రియను పెంచుతాయి. జీడిపప్పులో మోనోఅన్శాజురేటెడ్, పాలీఅన్సాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. వీటితో గుండె ఆరోగ్యానికి ప్రయోజనమే ఉన్నప్పటికీ.. హృదయ సంబంధిత వ్యాధులు ఉన్నవారు మాత్రం జీడిపప్పును ఎక్కువగా తీసుకోకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పలు ఆరోగ్య సమస్యలు కారణమవుతుందని చెబుతున్నారు. జీడిపప్పు ఆరోగ్యకరమైనది అయినప్పటికీ మితంగా తింటేనే మంచిదని అంటున్నారు. జీడిపప్పును తక్కువ మొత్తంలో తరచూ తీసుకోవడం వల్ల మీ ఆరోగ్యానికి ఎంతో మేలు అని చెబుతున్నారు. కాగా, ప్రతీ సంవత్సరం నవంబర్ 23న జీడిపప్పు దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ ఆచారం మొదట అమెరికాలో ప్రారంభమైంది. జీడిపప్పు చెట్టు ఈశాన్య బ్రెజిల్‌లో పుట్టిందని చెబుతుంటారు. జీడి పప్పు రైతులను గౌరవించేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుతారు. సాధారణంగా జీడిపప్పు చెట్టు జీవితకాలం 60 ఏళ్లు. జీడిపప్పు నాటిన మూడేళ్లలోపు దిగుబడిని ఇవ్వడం ప్రారంభిస్తుంది. గరిష్ట పంటకు ఎనిమిదేళ్లు పట్టవచ్చు.

# వాంఖ'డే' ఎవరిదో..

## సెమీస్‌లో నేడు ఇంగ్లాండ్‌తో భారత్ ఢీ

### రాత్రి 7 గంటల నుంచి




టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టు కఠిన సవాల్‌కు సిద్ధమైంది. గురువారం జరిగే సెమీఫైనల్లో ఇంగ్లాండ్‌ను టీమ్ఇండియా ఢీకొట్టనుంది. రెండు జట్లు సెమీస్ చేరిన తీరు భిన్నం. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిచినా.. సాధికారిక ప్రదర్శన చేయలేకపోయింది. సూపర్-8లో తడబడింది. దక్షిణాఫ్రికా చేతిలో పరాభవంతో గట్టి పరీక్షను ఎదుర్కొంది. చివరికి క్వార్టర్‌ఫైనల్ లాంటి మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను ఓడించి ముందంజ వేసింది. అదే సమయంలో ఇంగ్లాండ్ మంచి ఫామ్‌లో ఉంది. సూపర్-8లో ఆఖరి మ్యాచ్ ఆడడానికి ముందే ఆ జట్టు సెమీస్ స్థానాన్ని ఖాయం చేసుకుంది. అయితే ఇంగ్లాండ్ ఫామ్‌లోనే ఉన్నా.. ఆ జట్టుపై పొట్టి ఫార్మాట్లో టీమ్ఇండియాకు మంచి రికార్డు ఉంది. ఈ రెండు బలమైన జట్ల మధ్య ఆసక్తికర పోరు ఖాయం.

**జోరు కొనసాగిస్తాడా?**

సెమీస్ చేరినప్పటికీ డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ ఈ ప్రపంచకప్‌లో అంచనాలకు తగ్గట్లు రాణించలేదనడంలో సందేహం లేదు. అయితే సొంతగడ్డపై, అదీ మంచి రికార్డున్న వాంఖడేలో ఈ సెమీస్ జరుగుతుండడం సూర్యకుమార్ సేనకు గొప్ప సానుకూలాంశమే. అలాగే ఓపెనర్ సంజు శాంసన్ టాప్ ఫామ్‌ను అందుకోవడం ఆ జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. వెస్టిండీస్‌తో సూపర్-8 మ్యాచ్‌లో సంజు అద్భుత ఇన్నింగ్స్ (97 నాటౌట్)తో భారత్ విజయంలో కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. అతడు జోరు కొనసాగిస్తే భారత్‌కు తిరుగుండదు. తిలక్ వర్మ కూడా ఊపు మీదున్నాడు. కెప్టెన్ సూర్యకుమార్ లయలోనే ఉన్నా.. భారీ ఇన్నింగ్స్ బాకీ ఉన్నాడు. అయితే ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ మాత్రం ఆందోళన కలిగిస్తోంది. ఎన్నో అంచనాలతో టోర్నీలో అడుగుపెట్టిన అతడు.. జట్టును తీవ్రంగా నిరాశపరిచాడు. ఇప్పటివరకు 6 మ్యాచ్‌ల్లో 13.33 సగటుతో 80 పరుగులు చేశాడు. ఒక్క జింబాబ్వేపై మాత్రమే అతడు రాణించాడు. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌లో అతడు ఇబ్బందిపడుతున్నాడు. ఆత్మవిశ్వాసం లోపించిన అతడు ఈ మ్యాచ్‌తోనైనా పుంజుకుంటాడో లేదో చూడాలి.

ఇక ఆరంభంలో చెలరేగిన ఇషాన్ కిషన్.. ఆ తర్వాత ప్రభావం చూపలేకపోయాడు. పరుగుల వేటలో వెనుకబడ్డాడు. అభిషేక్‌తో పాటు అతడు బ్యాట్ ఝుళిపించడం అవసరం. బంతితో హార్దిక్ పాండ్య, వరుణ్ చక్రవర్తిల అస్థిరత కూడా టీమ్ఇండియాను కలవర పెడుతోంది. ముఖ్యంగా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ బాగా నిరాశపరిచాడు. లయను అందుకోలేకపోయిన అతడు.. వెస్టిండీస్, దక్షిణాఫ్రికాలపై భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. బౌండరీ చిన్నదిగా ఉన్న వాంఖడేలో అతడు, మరో స్పిన్నర్ అక్షర్ ఏమాత్రం గతి తప్పినా.. శిక్ష తప్పదు. ఇంగ్లాండ్ జట్టులో హిట్టర్లకు కొదవ లేదు. బుమ్రా ఎప్పటిలాగే సూపర్‌గా బౌలింగ్ చేస్తున్నాడు. కానీ చివరి అయిదు ఓవర్లలో మన పేసర్లు మెరుగైన ప్రదర్శన చేయాల్సివుంది. ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ వికెట్లు తీస్తున్నా.. ఎక్కువగా పరుగులిస్తున్నాడు. ఫీల్డింగ్‌లోనూ టీమ్ఇండియా చాలానే మెరుగుపడాలి. మిస్ ఫీల్డ్, క్యాచ్‌లు చేజార్చడంతో జట్టు ఇప్పటికే నష్టపోయింది. తండ్రి మరణంతో జట్టుకు కొన్ని రోజులు దూరమైన రింకు సింగ్.. అందుబాటులోకి వచ్చినప్పటికీ ఫామ్‌లో లేని అతడికి తుది జట్టులో అవకాశం కష్టమే. గత రెండు మ్యాచ్‌ల్లో ఆడిన జట్టునే కొనసాగించే అవకాశముంది.

**ఆత్మవిశ్వాసంతో..**

సూపర్-8లో సత్తా చాటడంతో ఇంగ్లాండ్ రెట్టించిన విశ్వాసంతో సెమీఫైనల్ పోరుకు సిద్ధమైంది. తమ ఆటగాళ్లలో చాలామందికి భారత్‌లో ఎన్నో మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉండడం ఆ జట్టుకు సానుకూలాంశం. పరిస్థితులు, పిచ్‌లు ఆ జట్టుకు కొత్త కాదు. సాల్ట్, బ్రూక్, బెతెల్, బాంటన్ వంటి వారితో ఇంగ్లాండ్ బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది. జాక్స్, సామ్ కరన్ కూడా బ్యాట్ ఝుళిపించగలరు. ఓపెనర్ బట్లర్ ఫామ్ మాత్రం ఆ జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటివరకు అతడు ఏడు మ్యాచ్‌ల్లో 8.85 సగటుతో 62 పరుగులు మాత్రమే చేశాడు. ఈ కీలక సమరంలో బట్లర్ ఎలా ఆడతాడో చూడాలి. బ్యాటర్లు సమష్టిగా రాణించాలని ఇంగ్లాండ్ కోరుకుంటోంది. ఇంగ్లాండ్ బౌలింగ్ విభాగం బలంగా ఉంది. శాంసన్‌ను షార్ట్ బంతులతో ఆర్చర్, పవర్‌ప్లేలో అభిషేక్‌ను ఆఫ్ స్పిన్‌తో జాక్స్ పరీక్షించే అవకాశముంది. డాసన్, అడిల్ రషీద్ రూపంలో మరో ఇద్దరు మెరుగైన స్పిన్నర్లు ఇంగ్లాండ్‌కు ఉన్నారు. మధ్య ఓవర్లలో రషీద్‌ను సమర్థంగా ఎదుర్కోవడం భారత్‌కు కీలకం. ఈ ప్రపంచకప్‌లో స్పిన్ బౌలింగ్‌లో ఇప్పటివరకు స్పిన్నర్లపై టీమ్ఇండియా పెద్దగా ఆధిపత్యాన్ని ప్రదర్శించలేకపోయింది. మ్యాచ్‌లో పైచేయి సాధించాలంటే స్పిన్నర్ల బౌలింగ్‌లో ధాటిగా పరుగులు రాబట్టడం అవసరం.

**సెమీస్‌లో గెలిస్తే.. కప్పు?**

భారత్, ఇంగ్లాండ్‌కు ఇది వరుసగా మూడో ప్రపంచకప్ సెమీఫైనల్ కావడం విశేషం. 2022లో భారత్‌ను ఇంగ్లాండ్ 10 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. 169 పరుగుల లక్ష్యాన్ని వికెట్ నష్టపోకుండా ఛేదించి పడేసింది. 2024లో ఆ జట్టుపై భారత్ ప్రతీకారం తీర్చుకుంది. 172 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించి, ప్రత్యర్థిని 103 పరుగులకే కుప్పకూల్చింది. ఈ విజయాల తర్వాత రెండు జట్లూ కప్పు గెలవడం విశేషం. మరి ఈసారి ఏ జట్టు సత్తా చాటుతుందో చూడాలి.

## 33 బంతుల్లో ఫాస్టెస్ట్ సెంచరీ.. వరల్డ్ కప్

# ఫైనల్లోకి దూసుకెళ్లిన కివీస్




టీ20 ప్రపంచకప్ సెమీ ఫైనల్లో న్యూజిలాండ్ ఓపెనర్ ఫిన్ అలెన్ సృష్టించిన విధ్వంసానికి దక్షిణాఫ్రికా చిత్తయింది. కేవలం 33 బంతుల్లోనే అజేయ శతకం బాదిన అలెన్... వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన సెంచరీని నమోదు చేశాడు. బుధవారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో సఫారీలను చిత్తు చేసిన కివీస్, ఘనంగా ఫైనల్లోకి అడుగుపెట్టింది. ఈ టోర్నీలో ఇప్పటివరకు అపజయం ఎరుగని దక్షిణాఫ్రికా, కీలకమైన నాకౌట్ మ్యాచ్‌లో మరోసారి చేతులెత్తేసింది.దక్షిణాఫ్రికా నిర్దేశించిన 170 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ కేవలం 12.5 ఓవర్లలో ఒకే వికెట్ కోల్పోయి 173 పరుగులు చేసి ఛేదించింది. న్యూజిలాండ్‌కు ఓపెనర్లు ఫిన్ అలెన్, టిమ్ సీఫర్ట్ (58) అదిరిపోయే ఆరంభాన్నిచ్చారు. ముఖ్యంగా అలెన్ ఆరంభం నుంచే సఫారీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. తన ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, 8 సిక్సర్లతో పరుగుల సునామీ సృష్టించాడు. వీరిద్దరూ తొలి వికెట్‌కు కేవలం 9.1 ఓవర్లలోనే 117 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను ఏకపక్షం చేశారు. సీఫర్ట్ ఔటయ్యాక వచ్చిన రచిన్ రవీంద్ర (13 నాటౌట్)తో కలిసి అలెన్ మరో వికెట్ పడకుండా 12.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని పూర్తి చేశాడు.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. ఒక దశలో 12 పరుగులకే 2 వికెట్లు, 77 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే, ఆఖర్లో మార్కో యాన్సెన్ (30 బంతుల్లో 55 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుతమైన హాఫ్ సెంచరీతో జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. డివాల్డ్ బ్రెవిస్ (34), ట్రిస్టన్ స్టబ్స్ (29) ఫర్వాలేదనిపించారు. కివీస్ బౌలర్లలో రచిన్ రవీంద్ర, మాట్ హెన్రీ, కోల్ మెక్‌కాంచీ తలా రెండు వికెట్లు పడగొట్టారు.

**ఫిన్ అలెన్ రికార్డుల మోత**

ఈ మ్యాచ్‌లో ఫిన్ అలెన్ పలు అరుదైన రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇదే అత్యంత వేగవంతమైన సెంచరీ (33 బంతుల్లో). గతంలో ఈ రికార్డు క్రిస్ గేల్ (47 బంతులు) పేరిట ఉండేది. టెస్టు హోదా ఉన్న దేశంపై టీ20ల్లో ఇదే ఫాస్టెస్ట్ సెంచరీ. అంతర్జాతీయ టీ20ల్లో ఇది సంయుక్తంగా మూడో అత్యంత వేగవంతమైన శతకం. టెస్టు హోదా ఉన్న జట్ల బ్యాటర్లలో సికందర్ రజా (జింబాబ్వే)తో కలిసి అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డును సమం చేశాడు. మొత్తంమీద ఫిన్ అలెన్ విధ్వంసక బ్యాటింగ్‌తో ఈ సెమీఫైనల్ మ్యాచ్ ఏకపక్షంగా ముగిసింది.

# గ్లోబల్ స్టార్ అక్కడ ఫోర్త్ ప్లేస్‌లో కూడా లేడా?



యాషికా అన్నంద్ బోల్డ్ గాంభీర్యంతో ఫ్రేమ్‌ని నిప్పులు చెరిగారు



టాలీవుడ్ స్టార్ హీరోల్లో నెంబరింగ్ గేమ్ ప్రధానంగా నడుస్తోంది. పాన్ ఇండియా సినిమాల ప్రవాహం మొదలైన దగ్గరి నుంచి ఏ స్టార్ హీరో బాక్సాఫీస్ సత్తా ఎంత అన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే కొంత మంది హీరోలు తమ క్రేజీ మూవీలతో బాక్సాఫీస్ వద్ద సోలోగా వందల కోట్ల వసూళ్లని రాబట్టి టాప్ పొజీషన్‌లో ఉన్నారు. అయితే ఈ రేసులో ఇద్దరు ముగ్గురు స్టార్ హీరోలు వెనకబడిపోయారు. వారిలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఎక్కడ? ఏ స్థానంలో ఉన్నారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.-బాహుబలి- సిరీస్‌తో పాన్ ఇండియా రేస్‌కు ప్రభాస్ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఫస్ట్ పార్ట్‌కి మించి -బాహుబలి 2- వరల్డ్ వైడ్‌గా బాక్సాఫీస్ వద్ద రూ.1805 కోట్లు రాబట్టింది. దీంతో ప్రభాస్ పాన్ ఇండియా స్టార్‌ల జాబితాలో చేరిపోయాడు. టాలీవుడ్ హీరోల్లో మొట్టమొదటి పాన్ ఇండియా స్టార్‌గా రికార్డు సాధించాడు. ఆ తరువాత కూడా అదే తరహాలో భారీ పాన్ ఇండియా సినిమాలు చేస్తూ బాక్సాఫీస్‌ని కొల్లగొడుతున్నాడు. ఫస్ట్ ప్లేస్‌లో ప్రభాస్ స్థిరపడిపోవడంతో తరువాతి స్థానం ఎవరిదిన్నది ఆసక్తికరంగా మారింది.ఆ తరువాత ప్లేస్‌ని ఎవరూ ఊహించని విధంగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సొంతం చేసుకుని అందరికి షాక్ ఇచ్చాడు. బన్నీ నటించిన -పుష్ప 2- మూవీ ప్రపంచ వ్యాప్తంగా ఏ స్థాయి సంచలనాలు సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. భారీ అంచనాల మధ్య విడుదలై ఆసక్తికరమైన కంటెంట్‌తో బాక్సాఫీస్ వద్ద సంచలనాలు సృష్టించింది. ప్రపంచ వ్యాప్తంగా రూ.1705 కోట్లు రాబట్టి బన్నీని రెండవ స్థానంలో నిలబెట్టింది. ప్రస్తుతం బన్నీ ఈ రేంజ్‌కి మించిన సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతున్నాడు.

ఇక మూడవ ప్లేస్‌ని గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ దక్కించుకుంటాడని అంతా భావించారు కానీ ఆ స్థానాన్ని మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ సొంతం చేసుకున్నాడు. కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటించిన యాక్షన్ డ్రామా -దేవర-. ఎన్టీఆర్ డ్యుయెల్ రోల్‌లో నటించిన ఈ మూవీ భారీ అంచనాల మధ్య విడుదలై ఆశించిన స్థాయిలో మాత్రం వసూళ్లని రాబట్టలేకపోయింది. ఫైనల్‌గా రూ.420 కోట్లని రాబట్టి పాన్ ఇండియా స్టార్‌ల రేస్‌లో వసూళ్ల పరంగా ఎన్టీఆర్‌ని నాలుగవ స్థానంలో నిలబెట్టింది.ఇదిలా ఉంటే స్టార్ హీరోలంతా పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ల కోసం ఎదురు చూస్తున్న వేళ సైలెంట్‌గా వచ్చేసి తేజ సజ్జ ఫిఫ్త్ ప్లేస్‌ని ఆక్రమించేశాడు. ప్రశాంత్ వర్మ డైరెక్షన్‌లో రూపొందిన ఫాంటసీ యాక్షన్ మూవీ -హను మాన్-. భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ పాన్ ఇండియా వైడ్‌గా బ్లాక్ బస్టర్ అనిపించుకుని బాక్సాఫీస్ వద్ద రూ.296 కోట్లు రాబట్టింది. ఈ సంక్రాంతి విడుదలైన -మన శంకరప్రసాద్‌గారు-తో (295 కోట్లు) మెగాస్టార్ ఆరవ ప్లేస్‌ని, రూ.286 కోట్లతో ఓజీ మూవీతో పవన్ కల్యాణ్ ఏడవ ప్లేస్‌ని, సంక్రాంతికి వస్తున్నాం- (260 కోట్లు)తో వెంకటేష్ ఎనిమిదవ ప్లేస్‌ని, -రంగస్థలం- (215 కోట్లు)తో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తొమ్మిదవ ప్లేస్‌ని, సరిలేరు నీకెవ్వరు (210 కోట్లు)తో మహేష్ పదవ ప్లేస్‌ని దక్కించుకున్నారు. రానున్న -పెద్ది-, వారణాసి సినిమాలతో ఈ ప్లేస్‌లు మారే అవకాశం ఉంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com